# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రిగారి భాషా నేపథ్యం - దృక్పథం

## ఆలమూరు మనోజ్ఞ



శ్రీ
కౌముది
మీ ముంగిళ్ళలో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 121

ఈ వ్యాసాలు

కౌముదిలో

2010 సెప్టెంబర్ నుంచి

2011 ఫిబ్రవరి వరకూ

ధారావాహికంగా ప్రచురితమైనాయి




# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి భాషా నేపథ్యం - దృక్పథం

- ఆలమూరు మనోజ్ఞ

(1)

శ్రీ ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారి పర్యవేక్షణలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఎమ్.ఫిల్ పట్టాకోసం సమర్పించిన గ్రంథం ఈ వ్యాసావళి. గ్రంథకర్త ఆలమూరు మనోజ్ఞ. ఈమె ఆంధ్రా యూనివర్సిటీలో ఎం.ఏ పూర్తిచేశారు. ఎమ్.ఫిల్ అయిన తర్వాత జర్నలిస్టుగా జెమిని టి.వి. లోనూ, హెచ్.ఎమ్ టి.వి. లోనూ రెండు సంవత్సరాల పాటు పనిచేసిన మనోజ్ఞ గారు ప్రస్తుతం పి.హెచ్.డి. కోసం కృషి చేస్తున్నారు.

## భూమిక

**దేశ భాషలందు తెలుగు లెస్స.** ఇది ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. తెలుగు చాలా మధురమైన భాష. ఎంతో మంది కవులు, రచయితలు ఈభాషలో రచనలు చేసి దీనిని పరిపుష్టం చేశారు. అటువంటివారిలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ముఖ్యులు. తెలుగులో అందునా వ్యవహారికంలో సుబ్రహ్మణ్యశాస్త్రి గారిది అందె వేసిన చేయి.

తెలుగు వ్యవహారిక భాషా రచనలో గురజాడ, గిడుగు రామ్మూర్తిల తర్వాత చెప్పుకోదగ్గ వ్యక్తి శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి. వాడుక భాషను ఎంత అందంగా, అద్భుతంగా ఉపయోగించి రచనలు చేయవచ్చునో నిరూపించి చూపించిన ఒకే ఒక వ్యక్తి ఈయన. తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడల తర్వాత మానవతావాద దృక్పథంతో సామాజిక ప్రయోజనమే ప్రధాన ధ్యేయంగా సాహిత్యాన్ని సృజియించిన ప్రసిద్ధ రచయిత శ్రీపాద. తన సాహిత్యంలో ఈయన అద్భుతమైన భావాలతో పాటు, అద్భుతమైన భాషను కూడా మనకు అందించారు. అందుకే విశ్వనాథ వంటి వారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గూర్చి చెబుతూ ఈ కింది విధంగా అన్నారు.

సర్వధా తమరీనాటి యాంధ్ర వ్యావహారిక
భాషా నిర్మాతృ గణ ప్రథమ గణనీయులు

(అనుభవాలు..జ్ఞాపకాలూ, ముందుమాట)

శ్రీపాద రచనలలో సమగ్ర సమీక్షలు, సిద్ధాంత వ్యాసాలు ఇప్పటికే చాలా వచ్చాయి. అలాగే రూపికలపై కూడా సిద్ధాంతవ్యాసాలు వెలువడినాయి. మొట్టమొదటగా 1985-86లలో చామర్తి కనకయ్య గారు వీరి కథలపై సిద్ధాంతగ్రంథాన్ని సమర్పించారు. తరువాత హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి కె.రాజు, మొదలగు వారు కూడా మరికొన్ని సిద్ధాంత వ్యాసాలు సమర్పించి ఉన్నారు. గొప్పవారిపై ఎన్ని వ్యాసాలు, సమీక్షలు వెలువడినప్పటికీ ఇంకా చెప్పవలసినది ఉంటూనే ఉంటుంది. ఆ విధంగా శ్రీపాదపై జరిగిన పరిశోధనలను పరిశీలించినప్పుడు వీరి భాషను గూర్చి కొంత చెప్పినప్పటికీ దానినే ప్రధానాంశంగా తీసుకుని పరిశోధనలు వెలువడలేదని తెలుస్తుంది. శ్రీపాద వారి రచనలలో భావాలు తెలియడం ఎంత ముఖ్యమో, వారి భాషను గూర్చి కూడా తెలుసుకోవడం అంతే ముఖ్యం.

శ్రీపాద వారి భాష గురించి తెలుసుకోవాలంటే...వారి చిన్ననాటి నుంచి జరిగిన సంఘటనలూ, వారికి తెలుగుపై మమకారం ఏర్పడడానికి గల కారణాలు, ఇంకా అనేకం తెలుసుకోవలసి ఉంటుంది. అంతే కాకుండా వీరి రచనల్లో శీర్షికలు, మాండలికాలు, పాత్రల పేర్లు, జాతీయాల ప్రయోగం మెదలగునవన్నీ పరిశీలించవలసి వుంటుంది. ఇవి అన్నీ కూడా శ్రీపాదవారి భాషా మాధుర్యాన్ని తెలిపేవిగా ఉంటాయనడంలో ఎటువంటి సందేహం లేదు. శ్రీపాద వారి రచనలు అన్నీ తీసుకుంటే అది ఒక మహాగ్రంథంగా తయారు అవుతుంది. అందువల్ల నా పరిశోధనలో కేవలం వారి కథలను మాత్రమే తీసుకోవడం జరిగింది. శ్రీపాద వారి కథలలో పైన చెప్పిన అంశాలన్నీ ఎలా రూపుకట్టాయో చెబుతూ...దాని ద్వారా వారి కథలలోని భాష ఎంత సుందరమైనదో నిరూపించడం ఈ పరిశోధన ప్రధానోద్దేశ్యం.

## శ్రీపాదవారి భాషా నేపథ్యం-దృక్పథం

శ్రీపాదవారి మీద ఇద్దరి ప్రభావం అత్యధికంగా ఉంది అనిపిస్తుంది. వారిలో ఒకరు వీరేశలింగం పంతులుగారు అయితే...రెండవ వారు గురజాడ. వీరేశలింగం గారి వల్ల ఆధునిక భావాలు అందిపుచ్చుకుంటే...గురజాడ నుంచి భాషను తీసుకున్నారు. అత్యంత ఆధునికమైన భావజాలాన్ని మరింత ఆధునికమైన, అద్భుతమైన వాడుక భాషలో కథలుగా రచించి తెలుగుజాతికి అందించిన వారు శ్రీపాద. అన్యభాషా సాహిత్యాల ప్రభావం ఏ మాత్రం లేకుండా స్వీయ ప్రతిభతో తెలుగువారికి నవ్య దృక్పథాన్ని అందించినది కేవలం వీరొక్కరే అని చెప్పవచ్చును.

కథలు చదివేటప్పుడు అందులోని భావాలు పాఠకుని మనసులోకి సూటిగా వెళ్ళలంటే భాష ప్రభావం ఎంతగానో ఉంటుంది. కథలోని భావం ఎంత బలిష్టమైనది అయినప్పటికీ అందులో వాడిన భాష సరిగా లేకపోతే అది పాఠకుని మనసును రంజింపచేయదు. అప్పుడు మొత్తం కథ ఉద్దేశమే చెడిపోతుంది. కథకు ఇతివృత్తం, భావం, శిల్పం మొదలగునవి ఎంత ముఖ్యమో భాష కూడా అంతే ముఖ్యం. పైవన్నీ ఎంత బాగా సమకూరినప్పటికీ భాష బాగుంటేనే ఈ కథకు పరిపూర్ణత చేకూరుతుంది.

శ్రీపాదవారి కథలలో భావాలు ఎంత బలంగా ఉంటాయో వారి భాష కూడా అంతే బలంగా ఉంటుంది. శ్రీపాద వారు వాడినది సరళమైన వాడుక భాష. దానినే వారు అత్యంత అద్భుతంగా రచించి అందరి చేత శభాష్ అనిపించారు. వీరి కథలు చదివిన ప్రతీ తెలుగువాడికి అందులోని తీయదనం అనుభూతం అవుతంది. అనుభూతం అయి ఆనంద తరంగాలలో ఓలలాడిస్తుంది కూడా.

శ్రీపాదవారికి తెలుగు, సంస్కృతం తప్ప మరే ఇతర భాషలు రావు. ఆయన నేర్చుకోలేదు కూడా. ఒకసారి ఓ యువకుడు ఆయన దగ్గరకు పోయి మీ భాష ఎందుకు ఇంత రమ్యంగా ఉంటుంది అనడిగితే...''నాకు హిందీ, ఇంగ్లీషు రాకపోవడమే''...అని సమాధానం చెప్పారట శ్రీపాదవారు. ఇంగ్లీషు రచనల అనువాదాలు అనేకం చదివినప్పటికీ...దానిని వారు నేర్చుకోలేదు. అసలు హిందీ అంటేనే ఆయనకు పడదు. దీనికి కారణం తెలుగు భాష మీద మక్కువే అని చెప్పవచ్చును. శ్రీపాద వారికి తెలుగు ఎంతిష్టమో సంస్కృతం అంటే అంత గౌరవం. శ్రీపాద వారి అభిప్రాయంలో సంస్కృతం భాషలన్నింటికీ మాతృభాషవంటిది. తన స్వీయచరిత్ర

అనుభవాలూ -జ్ఞాపకాలూనూ సంస్కృతం, తెలుగుల గురించి చెబుతూ ఆయన ఇలా అంటారు. ``సంస్కృతం వినా తెలుగు భాషకు పరిపూర్ణత లేదు, రానే రాదు కూడా`` అని.

2.1 **శ్రీపాద వారికి తెలుగుపై అభిమానం ఏర్పడడానికి గల కారణాలు:**

శ్రీపాదవారు పుట్టింది, పెరిగింది ఒక సంప్రదాయ బద్ధమైన కుటుంబంలో. ఈ కుటుంబంలోని వారికి సంస్కృత భాష అభిమాన భాష, తెలుగు చదువుకోవడం ఒక నీచంగా భావించే సంప్రదాయం వారిది. అటువంటి కుటుంబంలో పుట్టి తెలుగుపై మమకారం పెంచుకోవడం, చివరకు కుల వృత్తులను కూడా విడిచిపెట్టి తెలుగులోనే.....అదీ వ్యావహారికంలోనే రచనలు చేయడం శ్రీపాదవారి విశిష్టత.

ఈయన చూసిన మొట్టమొదటి తెలుగు పుస్తకం రుక్మిణీ కల్యాణం. కానీ వీరిని అత్యంత ఆకర్షించిన తెలుగు గ్రంథం మాత్రం వసుచరిత్ర. శ్రీపాదవారు గుంటూరి సీతారామశాస్త్రిగారి వద్ద సంస్కృతం చదువుకునే రోజుల్లో....ఆయన వద్దే మరొక యువకుడు వసుచరిత్ర చదువుకోవడం, అది వీరు వినడం జరిగింది. వింటున్న కొద్దీ వసుచరిత్ర వీరికి విశిష్టంగా కనపడింది. ఆ గ్రంథం మీద ఆసక్తి రేకెత్తించింది. దాంతో శ్రీపాద నాకూ పాఠం చెప్పమని గురువుగారిని అడుగగా...ఆయన మొదట సంస్కృతం పూర్తిగా చదువుకో తరువాత ఇది అని చెప్పి పంపేశారు. ఇంటివద్ద పెద్దన్నగారిదీ ఇదే మాట. వీరి ఇంకొక గురువుగారైన దర్భా భైరాగిశాస్త్రి అయితే ఏకంగా ``చచ్చు తెనుగు ఫోనిస్తూ`` అని అనేశారుట. ఇంకా సంస్కృత సాహిత్యం అంటరానివాడే తెనుగుల్లోకి ప్రవేశిస్తాడు, మనకది తగదు అనిన్నీ మందలించారుట.( అనుభవాలూ-జ్ఞాపకాలూనూ) ఈ మాటతో....అదీ ఒక తెలుగు వాడే తెలుగు గూర్చి ఇలా అనేసరికి వీరికి అది నేర్చుకోవాలన్న తపన, కసి మొదలైంది.

``నా తెలుగు నాకెందుకు తెలియక పోవాలీ? అని నాకావేదన కలగడానికీ, దాని విషయమై శ్రద్ధ పుట్టడానికి అదే కారణం`` అని శ్రీపాద తన అనుభవాలూ-జ్ఞాపకాలూనూలో చెప్పుకున్నారు. దీంతో ఆయన తెలుగులో మంచి సాహిత్యం సంపాదించాలనీ కూడా నిర్ణయించుకున్నారు.

**2.2 ఆంధ్రభాషాభిమానం:**

శ్రీపాదవారికి తెలుగు భాష, తెలుగు సంస్కృతి అంటే విపరీతమైన అభిమానం. అందుకే ఆయన తన అనుభవాలూ-జ్ఞాపకాలూనూలో ఇలా చెప్పుకున్నారు.

``నా దృష్టిలో తెనుగు దేశమే దేశం``

`` తెనుగు భాషే భాష``

``తెలుగు మనుష్యులే మనుష్యులు``

``తెలుగు వేషమే వేషం `` ఇంతేకాదు

``ఏ జాతీ మొదటా- ఏ సందర్భంలోనూ, ఎందుకున్నూ నా తెలుగు జాతి తీసిపోదు.`` ఇంకా ఇలా కూడా చెప్పారు. ``తెలుగు భాష సరస్వతీ వాగ్విలాసం, స్వయంభువు. అసూయాజనకమై మాధుర్యం దానిది. ఖండానికంతకూ ఏకైక మధురిమం అది.``

**(పేజీ సంఖ్య 60, అనుభవాలూ-జ్ఞాపకాలూనూ, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి )**

అందుకే దీనిని కాపాడుకోవడమే అసలైన జాతీయత అనేది వీరి అభిప్రాయం. భారతీయుల్లో తెలుగు వారికే భాషా పరంగానూ, ప్రాంతీయ పరంగానూ అభిమానం తక్కువనీ.....దానిని వృద్ధి పరుచుకుంటేనే తెలుగు జాతికి వికాసమనీ, తన రచనల ద్వారా చెబుతూ

వచ్చారు. భాషా సంబంధమైన వస్తువుతో చిత్రించిన మూడు కథలు "శుభికే శిర రోహ", "వట్టి పట్టుదల తప్ప ఏమీ లేదు", "ఎక్కడా లంగరందలేదు"లలో వీరి మాతృ భాషాభిమానం స్ఫుటంగా గోచరిస్తుంది.

''తెనుగు భాష తన విశ్వరూపం కనబరుస్తుంది......''

''నా తెనుగు భాష శాస్త్రీయం - తాటాబూటం కాదు''.

''నా తెనుగు భాష యుగయుగాలుగా ప్రవాహిని అయి ఉండినది కానీ యివాళ ఆ భాషలో నుంచి ఒక మాటా, యీ భాషలోంచి ఒక మాటా ఎరువు తెచ్చుకుని భరత విద్య ప్రదర్శిస్తున్నది కాదు''.

''నా తెనుగు భాష సరస్వతికే తేనె చినుకులందించినది గాని నీరు చప్పనిది కాదు. ''

''నా తెనుగు ఎక్కడ పట్టినా చక్రవర్తుల రాజ్యాంగాలు నడిపించింది గాని పరాన్నభుక్కు గాదు.''

''నా తెనుగు స్వతంత్రంగా బతగ్గలది గాని కృత్రిమ సాధనాలతో ప్రాణ వాయువు కూర్చుకోవలసింది గాదు, అక్రమ దోహదాలతో పోషింపబడవలసిందీ కాదు. యావద్భారతదేశంలోనూ, ఈ విశాల విశ్వంలోనూ కూడా.''

**(పేజీ సంఖ్య 61-62; అనుభవాలూ-జ్ఞాపకాలూనూ; శ్రీపాద)**

అన్న ఈ వాక్యాలు శ్రీపాదవారి తెలుగు భాషాభిమానానికి అద్దం పడుతున్నాయి. వారిలో మూర్తీభవించిన ఈ లక్షణం అంతా వారి జీవిత చరిత్రనూ, రచనలనూ పరిశీలించి చూస్తే ద్యోతకమౌతుంది. అంతేకాదు తెలుగు మాండలికాలలోని ప్రయోగ వైవిధ్యంలో ఉన్న గొప్పతనాన్ని పసిగట్టి, అదే భాషకు జీవం వంటిదని అభిమానంతో ప్రకటించారు శ్రీపాద. తెలంగాణ మాండలికానికి మనసే ఇచ్చేసారు. ఈ క్రింది వాక్యాలే దీనికి నిదర్శనం.

''తెనుగులో ఉన్న ఐదు మాండలికాలు ఐదు రత్నాల వంటివి. ఒక్కొక్క సీమలో ఒక్కొక్క జీవకణం ఉంది. తెనుగు రక్తంలో అన్నీ ఒక చోటికి చేర్చగల, నిక్షేపించగల మొనగాడు పుట్టుకురావాలి.''

(అనుభవాలూ-జ్ఞాపకాలూనూ, శ్రీపాద)

**<u>2.3 వ్యవహారిక భాషాభిమానం:</u>**

శ్రీపాదవారు తనరచనా వ్యాసాంగాన్ని మొదట గ్రాంథిక భాషలోనూ, పద్యరచనతోనూ ప్రారంభించినా, తరువాత తర్వలోనే వారు వ్యావహారిక భాషలోకి, వచనంలోకి మారిపోయారు. ఈయన మొట్టమొదటి కథ ''ఇరువురమొక్క చోటికే పోదము''ను గ్రాంథిక భాషలో రచించారు. కానీ తరువాత వచ్చిన కథలన్నీ వ్యవహారికంలోనే సాగాయి.

''వచనం మీద ఇష్టం వీరికి చిన్నప్పుడే కలిగింది. వచనంలో ఉన్న సౌలభ్యం పద్యంలో లేదని.... వుండడానికి వీల్లేదని పాఠశాలలో మూడో తరగతిలో రుక్మిణీ కల్యాణం చదివినప్పుడే అనుభూతం అయివుండింది నాకు.''

''పాఠశాల చదువు తక్కువే అయినా , ధారాళమైన వాచకం నాది మొదటిన్నుంచీ.''

''పద్యం మీదకంటే వచనం మీదా, వచనంలో మళ్ళీ సులభమైన సరళవచనం మీదా రుచీ, అభిమానమూ కలగడానికిదే కారణం అయింది నాకు'' అని ఆయన చెప్పుకున్నారు.

**(అనుభవాలూ-జ్ఞాపకాలూనూ, శ్రీపాద)**

ఇలా మొదలైన వచనం మీద ఇష్టం చివరకు అందులోనే అనేకమైన రచనలు రాయడానికి కారణభూతమైంది. వీరు వచనంలోకి దిగడానికి గురువులైన రామకృష్ణశాస్త్రి, వెంకటరామశాస్త్రిగార్లు కూడా కొంత కారణం. వీరిరువురి సలహా మీదనే శ్రీపాదవారు పూర్తిగా

పద్యరచన మానివేసి వచనంలోకి.... తరువాత వ్యావహారికంలోకి దిగి రచనలు చేసారు. అప్పుడూ ఇప్పుడూ వచన రచనలో అనుభూతం అవుతున్న ఆనందం పద్యరచనలో నాకెప్పుడూ కలగలేదని, నన్ను ఈ దారిలోకి మళ్ళించిన నా గురువులకు ఎప్పుడూ ఋణపడి వుంటానని తరువాత తరువాత శ్రీపాద వారు స్వయంగా చెప్పుకున్నారు.

**(అనుభవాలూ-జ్ఞాపకాలూనూ, శ్రీపాద)**

ఇంకా వ్యవహారికి భాష గురించి శ్రీపాదవారు తన అభిప్రాయాన్ని ఇలా చెప్పారు.

''రసం అన్నది వాక్యంలో పొటమరిస్తుంది కానీ శబ్ద రూపాల్లోనూ, క్రియా రూపాల్లోనూ కాదు మరి.'' ''వ్యావహారికంలో అయితే రచన మరీ నీరసం అవుతుందనుకోవడమూ, గ్రాంథికం అయితే చాలు రసమహితం అయిపోతుందనుకోవడమూ అవివేకానికి రెండు నిదర్శనాలు.''

''గ్రాంథికం వ్యాకరణ యుక్తం అయివుంటుందనీ, వ్యావహారికం వ్యాకరణ దూరం అనీ అనుకోవడం అవివేకానికి మూడో నిదర్శనం.''

**(అనుభవాలూ-జ్ఞాపకాలూనూ,శ్రీపాద)**

ఈయన రచించిన కథలలో ''వట్టిపట్టుదల తప్ప ఏమీ లేదు'' అనేది పూర్తిగా వ్యావహారిక భాషా విషయమై రాయబడింది. అలాగే వ్యావహారిక భాష గురించి శ్రమ చేసిన గిడుగు వారన్నా శ్రీపాద వారికి అమితమైన గౌరవం. మరో కథ ''అనుకున్నంత పనీ అయింది''లో వ్యావహారికం గూర్చి, గిడుగు వారి గూర్చి ఇలా అంటారు శ్రీపాద.

''అదేనోయ్ వ్యావహారికం దేశం అంతటా అప్పుడే పాకిపోయింది కాదూ? మహా దిట్టమైన వాడోయ్ గిడుగు రామ్మూర్తి పంతులు. నవీన వాఙ్మయ నిర్మాతలయిన యువకులందరినీ లోపుచేపుకున్నాడు పంతులు. ముసలి తలకాయలు గ్రాంథికమో అంటూ ఎంత గొల పెడితే మాత్రం, వాదం ఇంకెన్నాళ్ళు నిలుస్తుందీ'' అని తన అభిమానాన్ని చాటుకున్నారు.

ఇక ''వట్టి పట్టుదల తప్ప ఏమీ లేదు'' అన్నకథ విషయానికి వస్తే రచనా భాషగా వెనుకబడుతున్న గ్రాంథిక భాష ఓటమిని, అభివృద్ధి చెందుతున్న వ్యవహారిక భాషకు జయాన్ని సంకేతాత్మకంగా పాత్రల ముఖంగా నిరూపించారు. ఈ కథలో రామశాస్త్రి వీర గ్రాంథిక వాది. ఇతడు వ్యావహారిక భాషను నిరసిస్తూ ఉంటాడు. అయితే ఇందులో రామశాస్త్రి గ్రాంథిక భాషావాదాన్ని నిరసిస్తూ సత్యవతి అనే పేరుతో రచనలు వెలువడుతుంటాయి. పత్రికా ముఖంగా వీరిద్దరి మధ్యా భాషాపరమైన వాదోపవాదాలు చెలరేగుతాయి. ఒకరోజు రెండు రకాలైన వాదనలకు పత్రికాధిపతి చర్చ ఏర్పాటు చేస్తారు. దానిలో రామశాస్త్రి తన గ్రాంథిక భాషావాదాన్ని వినిపిస్తాడు. వ్యవహారిక భాషావాదానికి సంబంధించి వ్యాసాన్ని అందులో రచనలు చేస్తున్న సత్యవతి అనే పేరుగల వ్యక్తి పక్షాన సభాకార్యదర్శి చదువుతాడు. దీనికి వ్యవహార భాషావాదులు భలే అని మెచ్చుకుంటే....రామశాస్త్రి వర్గం వారు తమకు అపజయం తప్పదని శంకిస్తారు. నిబంధన ప్రకారం రామశాస్త్రి రెండో అంశం ఆశువుగా వాదం ప్రారంభిస్తాడు. గంటసేపు గుక్క తిప్పకోకుండా వాదించాలనుకున్న శాస్త్రి కేవలం పదే పది నిమిషాల్లో ముగింపు భరతవాక్యం పలికేస్తాడు. ఇక సత్యవతి వంతు. అంతకుముందు సత్యవతి వేదిక మీదకు రాకపోవడంతో ఈసారైనా వేదిక మీదకు రావాలని సభ గగ్గోలు పెడుతుంది. తప్పేది లేక ఆమె శిరసు వంచి శాస్త్రి ముందు నిలబడి రెండు జోడించి నమస్కరిస్తుంది.

''శాస్త్రి తల ఎత్తి చూసాడు''

''ఆశ్చర్యం!''

''ఎవరో కాదు ఆమె తన భార్య..... రుక్మిణి''

''సత్యవతి కలం పేరుతో పాఠకులను ఆకట్టుకుంటున్న రుక్మిణి''

తరువాత రుక్మిణి తన వ్యావహారిక భాషలో అనర్గళంగా మాట్లాడి అందరినీ ముగ్ధులను చేస్తుంది. రామశాస్త్రి కూడా వ్యావహారికి భాషా వాదంలోని ఔచిత్యాన్ని, మాధుర్యాన్నీ గుర్తించి....తన ఓటమిని అంగీకరించి.....దాని విజయాన్ని ఆహ్వానిస్తాడు. ఈ ముగింపు రామశాస్త్రిలోనే కాదు పాఠకులలో కూడా తట్టుకోలేనంత వత్తిడిని కలిగిస్తుంది. ఇది చదివిన వారు ఎవరైనా వ్యావహారిక భాష గొప్పదనాన్ని ఒప్పుకుని తీరవలసిందే ఇందులోని శ్రీపాద చేసిన వ్యావహారిక భాషావాదం సూటిగా, చాలా స్పష్టంగా ఉంటుంది. వ్యావహారిక, గ్రాంథిక భాషా సమస్యకు కళారూపాన్ని ఇవ్వడం వల్ల పాఠకుని మనసులోకి చొచ్చుకుని వెళ్ళింది.

ఈ విధంగా వ్యవహారిక భాషాగతమైన మాధుర్యాన్ని కథలోని పాత్రల ద్వారా అత్యంత వాస్తవంగా పలికింపచేసిన శ్రీపాద వ్యావహారిక భాషలో తనకున్న అర్హతను సహజంగానూ, సవినయంగానూ ఇలా ప్రకటించుకున్నారు.

‘‘గ్రంథాలు చదివే నేను భాష తెలుసుకున్నాను. స్త్రీలనాశ్రయించిన్నీ నేర్చుకున్నాన్నేను. తెలుగు భాష ప్రయోగ విజ్ఞానం కూడా స్త్రీల వల్లనే అలవడింది నాకు.‘‘

‘‘..........పురుషుల భాష కంటే స్త్రీల భాషలో మాధుర్యమూ, హృదయాలను పట్టివేసే జాతీయతా కనపడింది నాకు‘‘.

‘‘వారి మాటల పొందికా, వారి హావభావ ప్రదర్శనా చాతుర్యమూ తెనుగు భాషలో నాకు మాతృభిక్షను ప్రసాదించాయి. ‘‘

‘‘జాతీయమైన తెనుగు భాష కావాలంటే స్త్రీల దగ్గరే నేర్చుకోవాలి. మర్యాద గల తెనుగు భాష కావాలంటే.....మళ్ళీ క్షత్రియ రమణుల దగ్గర నేర్చుకోవాలి. మరోదారి లేదు.‘‘

‘‘ఇవాళ నేను రాస్తున్న భాష వారనుగ్రహించిన దాన్లో సహస్రాంశమయినా కాదు‘‘.

**(అనుభవాలూ-జ్ఞాపకాలూనూ, శ్రీపాద)**

## 2.4 హిందీ భాషా వ్యతిరేకత:

ఈయన జాతీయవాద దృక్పథం ఒక ప్రత్యేకతను, విశిష్టతను కలిగినటువంటిది. జాతీయోద్యమకాలంలో భారతీయులలో స్ఫూర్తిని కలిగించడానికి....భారతీయులంతా ఒకే జాతనీ, అందరికీ హిందీ అనేది ఒక భాషగా ఉండాలనీ అనేది అప్పటి కాంగ్రెస్ ప్రచారంలో భాగం. దీనిలో కొన్ని అశాస్త్రీయమైన అంశాలను శ్రీపాద వారు వ్యతిరేకించారు. దానిలో భాగమే అతివాద హిందీ ప్రచార నిరసనం. వీరు ఎప్పుడూ ఏ భాషకూ పూర్తిగా వ్యతిరేకులు కాదు. కేవలం తెలుగు వారు తెలుగును మర్చిపోయి హిందీని ఆదరిస్తున్నారన్న భావంతోనే హిందీకి వ్యతిరేకంగా రచనలు చేశారు. ఆ రోజుల్లో తెలుగునాట జాతీయోద్యమంలో భాగంగా హిందీ ప్రచారం ముమ్మరంగా సాగుతుండేది. తెలుగువారు మాతృభాషను వదిలిపెట్టి హిందీని వెర్రిగా నెత్తికెక్కించుకునేవారు. ఇది తెలుగు జాతి అభ్యున్నతికి ఆటంకం అనీ శ్రీపాదవారి అభిప్రాయం. తెలుగు జాతి అభ్యున్నతి మాతృభాష ద్వారానే కలుగుతుందనీ....అదే అసలైన జాతీయత అనీ వారు ప్రతిపాదించారు. మన దేశంలో భిన్న భాషలు, భిన్న ఆచార వ్యవహారాలు ఉండడం చేత మాతృభాషను అభివృద్ధి పరుచుకోవడమే జాతీయత అవుతుంది కానీ, హిందీని అతిగా వ్యాపింప చేయడం వల్ల కాబోదని ఈయన ప్రచారం చేశారు. నాటి హిందీకి, హిందీ ప్రచారకులకు వ్యతిరేకంగా రెండు కథలను రచించారు. మొదటిది ‘‘శుభికే శిర రోహ‘‘ అయితే, ‘‘రెండవది ఎక్కడా లంగరందలేదు‘‘.

‘‘శుభికే శిర రోహ‘‘ అనే కథలో రమేష్ , గంగమ్మ అనే పాత్రలు హిందీభాషాభిమానులకు, జానకి, జగ్గప్ప, అన్నపూర్ణ ఇంకా మిగతావారు హిందీ వ్యామోహాన్ని నిరసించిన తెలుగు భాషాభిమానులకు ప్రతీకలు. అతిగా హిందీ ప్రచారం చేసేవారి చేష్టలను, భావాలనూ రొమేష్ , గంగమ్మ పాత్రల ద్వారా వ్యక్తపరిచారు. ఇందులో రొమేష్ అసలు పేరు రామేశం. కానీ ఇతడు హిందీ వారి

ప్రభావంతో తన పేరును పై విధంగా మార్చేసుకుంటాడు. దానికి అతడు ఇచ్చిన వివరణ చాలా అర్థం లేనిదిగా, నవ్వు తెప్పించేదిగా ఉంటుంది. సంభాషణ ఇలా ఉంటుంది.

''రొమేష్ అన్నావేమిటోయ్ నీపేరూ?....''

''.....................................................''

''అందులో అర్థం లేదు మావయ్యా!

''రాముడికి ఈశ్వరుడేమిటి, తెలివితక్కువ కాకపోతే?''

''....................................''

''మరి రొమేష్ అంటే ఏమిటి?''

''లక్ష్మీదేవి భర్త అన్నమాట.''

''..............................................''

''ఏ భాష అదీ ?''

''సంస్కృతం అన్నాడు రొమేష్ , ఇంగ్లీషు పండితుల ఉచ్చారణతో.

''...........తరువాత రొమా+ఈష్ ఊనా? అని తాపీగా అడిగాడు జగ్గప్ప.''

''అవును.''

''రొమా అంటే?''

''లక్ష్మి అన్నమాట. ఈష్ అన్నది ఈశశబ్ద వికృతి.''

''రమా రొమా?

''ఉత్తరదేశంలో రాతలో రొమా అనే ఉంటుంది, కానీ పలుకుబడిలో రొమా అని.''

''ఉన్నది ఉన్నట్టు పలికితే యేం?''

''పనికిరాదు. సంస్కృత భాషా సంప్రదాయం ప్రకారం 'రొమా' అనే పలకాలి. మన వాళ్ళకి హ్రస్వాకారం ఎలా పలకాలో తెలియదు.''

''అయ్యో?''

''అయ్యో అంటే? ఈ విషయంలో మనలో మహా మహా వ్యాకరణ శాస్త్రవేత్తలం అనుకునే వాళ్ళు కూడా ఉత్తరదేశపు హీన జాతులపాటయినా యెరుగరు.''

''బాగుంది.....అయితే అ, ఎలా పలకాలోయ్ ?''

''ఒ, అని. ''

**( పేజీ సంఖ్య 104, 105; శుభికే శిర రోహ; శ్రీపాదవారి కథలు రెండవ సంపుటం)**

ఇలా కథ అంతా హిందీ వాళ్ళను పొగుడుతూ....మన వాళ్ళను తిడుతూ తన అజ్ఞానాన్ని బయటపెడుతూ ఉంటాడు. ఇంకా తిండి విషయంలో కూడా వాళ్ళు తినేదే మంచిది అని....మనం తినేది ఒట్టి తుక్కు అని అంటాడు. చివరకు కర్నాటక సంగీతాన్ని హేళన చేస్తాడు. మనవి అర్థంలేని గాలిపాటలు, పడవ పాటూ అంటూ....హిందీవారి హిందూస్థానీయే నిజమైన సంగీతం అనీ చెబుతాడు. ఈకథలో శ్రీపాదవారు రొమేష్ యొక్క హిందీ అభిమానాన్ని పరాకాష్ట చేరుకునే వరకు చూపిస్తారు. అన్యభాషను హద్దుమీరి ప్రచారం

చేయడం ద్వారా జాతిలో భావదాస్యం ఏర్పడుతుందనే తన భావాన్ని ప్రకటిస్తూ....హిందీ భాషా వ్యామోహపరులను అవహేళన చేసిన రచన ఈ కథ.

ఇలాగే ఎక్కడా లంగరందలేదు అనే కథలో కాంగ్రెస్ సభలకు వెళ్ళిన ఔత్తరాహులు వారి వారి మాతృభాషను గురించి ప్రకటిస్తు ఉండగా...తెలుగు వారు మాత్రం ఆత్మద్రోహం చేసుకుంటూ హిందీని ప్రశంసిస్తారు. అటువంటి వారి గురించి ఈ కథ రాయడం జరిగింది. కాంగ్రెస్సు వారిలో ఉన్న హిందీ భాషా వ్యామోహపరులు తెలుగుకు చేస్తున్న ద్రోహాన్ని ఈ కథలో చిత్రించారు శ్రీపాద. ఈ రెండు కథలూ వీరి ఆంధ్రభాషాభిమానంతో పాటూ, జాతి అభివృద్ధి మాతృభాషపైనే ధారపడి వుందనీ, అన్యభాష వలన జాతికి స్వతంత్ర భావాలు నశిస్తాయనే వారి శాస్త్రీయమైన ఆలోచనలకు ప్రతీకలు.

హిందీ భాషా ప్రచారకుల అతివాద ధోరణి వలన తెలుగు భాషకు, జాతికి, విపరీతంగా అపకారం జరుగుతుందని గుర్తించి హిందీ వల్ల తెనుక్కి జరుగుతూన్న అపకారం అనే శీర్షికతో ప్రబుద్ధాంధ్ర పత్రికలో ఒక చర్చా గోష్ఠిని నిర్వహించారు. దీనిపై పలువురి అభిప్రాయాలను లేఖల రూపంలో పత్రికలో ప్రచురిస్తూ తెలుగుభాషకు ఎనలేని సేవ చేశారు శ్రీపాద.

శ్రీపాద వారు హిందీని ఎందుకు వ్యతిరేకించాల్సి వచ్చిందో కారణాలు చెబుతూ కొడవటిగంటి కుటుంబరావు చామర్తి కనకయ్యకు రాసిన లేఖలో శ్రీపాదవారి అభిప్రాయాన్ని స్పష్టంగా తెలియజేశారు.

''ఆయన హిందీ వ్యతిరేకతకు ముఖ్య కారణాలు నాకు తెలిసినవి రెండు. సాహిత్యంలో హిందీ, తెలుగు కన్నా హెచ్చయినది కాదు. హిందీ వ్యామోహంతో తెలుగులో ఉత్తరం ముక్క రాయలేని తెలుగు కుర్రవాళ్ళు వందల సంఖ్యలో హిందీ చదువులకు ఎగబడ్డారు. ఉత్తర భారతదేశం నుండి ప్రచారకులు వచ్చి, తెలుగు పట్టణాలలో చేరి వందల కొద్దీ విద్యార్థులను చేరదీసి వాళ్ళ చేత హిందీ చదువులు చదివించడం చూసి ఆయనకు రక్తం ఉడికిపోయింది. అది జాతీయోద్యమంలో అంతర్భాగంగా జరగడం కూడా ఆయనకు నచ్చకపోయి ఉండవచ్చు. ఆయన వాదాలను చాలామంది సరిగ్గా అర్థం చేసుకోలేదు. హిందీ భాష ఒక తీవ్ర సమస్యగా ఎవ్వరూ అప్పట్లో భావించలేదు. అందుచేత శాస్త్రిగారు ఒంటరిగా పోరాటం సాగించవలసి వచ్చింది.''

(పేజీ సంఖ్య:284; శ్రీపాద రచనలు- సమగ్ర సమీక్ష; చామర్తి కనకయ్య 1986)

ఈ విధమైన అభిప్రాయాలే శ్రీపాదవారిని హిందీ భాషా వ్యతిరేకిగా చేశాయి. అందుకే హిందీ భాష వల్ల మాతృభాష అయిన తెలుగును నాటి యువకులు నేర్చుకోక వ్యామోహంలో పడికొట్టుకుపోతున్నారని ఆవేదన చెందారు. మన మాతృభాషను పరిరక్షించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని.... అన్యభాషలను చేరదీయడం వల్ల తెలుగుజాతి ఔన్నత్యం, గౌరవం తగ్గిపోతాయని శ్రీపాదవారు భాషలపై తీవ్ర నిరసన భావాన్ని ప్రకటించారు.

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి భాషా నేపథ్యం - దృక్పథం

## - ఆలమూరు మనోజ్ఞ

(2)

### శీర్షికలు-ఔచిత్యం

*3.1 కథలలో శీర్షికలు*

కథ రాయడం ఒక ఎత్తు అయితే దానికి పేరు పెట్టడం ఒక ఎత్తు. ఇతివృత్తం, ఎత్తుగడ, నడక, పట్టు..విడుపు, ముగింపు, పాత్ర ఇవన్నీ కథలోని అంతర్భాగాలు. కానీ శీర్షిక కథకు తలమానికం వంటిది. కథ తియ్యగానే మొదట గమనించేది శీర్షికను. శీర్షిక ఆకర్షణీయంగా ఉంటే చదవడం మొదలుపెడతాం.

లోకంలో వివిధ వ్యక్తులను గుర్తించడం కోసం వేరు వేరు పేర్లు పెట్టుకుంటాం. ఇది కేవలం మన సౌకర్యం కోసం ఏర్పడిన సంప్రదాయమే. పుట్టిన ప్రతి వ్యక్తికీ ఏదో ఒక పేరు పెట్టడమన్నది మానవ సంస్కృతిలో అంతర్భాగం. అయితే ఇక్కడ గుర్తించవలసినది ఏమిటంటే....మనిషి పేరుకూ, కథ పేరుకూ ఒక భేదం ఉంది. మనిషికి పెట్టే పేరు అతని రూపురేకలతో గానీ, స్వభావంతో గానీ నిమిత్తం ఉండదు.

ఉదా....సరస్వతి అనే అమ్మాయికి చదువు బాగా రావచ్చు, రాకపోవచ్చు. వస్తే కేవలం అది యాదృచ్ఛికమే అని గ్రహించాలి. కానీ కథకు పెట్టే పేరుకు కథలోని ఏదో ఒక అంశంతో సంబంధం ఉండటం దాదాపు సర్వసాధారణం. కొన్ని కొన్ని చోట్ల శీర్షికలు లేని కథలు కూడా ఉండటం జరిగింది. ఇవి చాలా అరుదు. అందువల్ల కథకు ఎంత గుర్తింపు ఉంటుందో కథా శీర్షికకు కూడా అంతే గుర్తింపు ఉంటుంది.

శీర్షిక ఆకర్షణీయంగా ఉంటే కథ చదవడం మొదలుపెడతాం. అయితే శీర్షికలో ఉన్న ఆకర్షణ కథలో లేకపోతే ఎంత మంచి రచన అయినా మరుగున పడిపోయే ప్రమాదముంటుంది. కథలో పస లేకపోయినా పేరు గొప్పతో బతికే కథలూ ఉంటాయి. కానీ వాటిని వేళ్ళ మీద లెక్కపెట్టవచ్చును. సాధారణంగా రచన పూర్తయిన తరువాతే పేరు పెట్టడం అన్నది రచయితలందరూ అనుసరించే పద్ధతి. అయితే పేరు ముందు పెట్టి తరువాత రచనలు చేసే సందర్భాలూ లేకపోలేదు. ముఖ్యంగా, మంచి పేరు మనస్సుకు స్ఫురించడం వల్ల దాంతో కథ రాసేవాళ్ళూ ఉన్నారు.

సుందరమైన విగ్రహానికి నొసటి తిలకం లాగే చక్కటి కథకు మరింత చక్కదనం చేకూర్చేది పేరు. అక్షరాల కూర్పులో కాని, అర్థం కాని ఏదో ఒక అందం కోసం పెట్టే పేర్లూ కథానికా సాహిత్యంలో అసంఖ్యాకంగా ఉన్నాయి. అయితే వీటిలో కృతకత్వం తొంగిచూసినప్పుడు, నిరలంకృతమైన సాదా శీర్షికలే మేలనిపించే సందర్భాలూ రాకపోవు. మొత్తం మీద ఏ కథకు ఏ పేరు పెట్టినప్పటికీ అది వస్తువు కాని, పాత్రతో కాని, ఒకానొక జీవిత సత్యంతో కాని సంబంధించి ఉండటం చాలా సమంజసమైన విషయం. దీన్ని మొట్టమొదట పాటించిన వారు గురజాడ.

పేరు పెట్టే పద్ధతుల గురించి ముచ్చటిస్తూ ఒక రచయిత, మూడు రకాలను ప్రధానంగా చెప్పారు. వాటిలో కొన్ని అంతర్ భేదాలను సూచించారు. ఆయన చెప్పిన వాటిలో మొదటి పద్ధతి....

1. ఒకే పదం గల పేరు పెట్టడం. ఈ పద్ధతి మళ్ళీ మూడు రకాలుగా ఉంటుంది.

(అ) కథలో వచ్చే ప్రధాన పాత్ర పేరు పెట్టడం. ( ఉదా: శ్రీదేవి, అన్నపూర్ణ, సుభద్ర, సుగుణ)

(ఆ) కథలో పాత్ర గాథని తెలిపే విధంగా పేరు పెట్టడం. (ఉదా: అభాగిని, కోడలు, సంస్కారి)

(ఇ) కథలోని ముఖ్య సంఘటనను సూచించే పేరు పెట్టడం (ఉదా: సత్యాగ్రహం, తుఫాను)

2. రెండో పద్ధతి నామకరణం....అంటే రెండేసి శబ్దాలు శీర్షికలుగా పెట్టడం. ఇది కూడా మళ్ళీ రెండు రకాలు.

(అ) కథలో అంతర్గర్భితమైన నిగూఢ భావాన్ని శీర్షికగా పెట్టడం. (ఉదా: గాలి చేపలు, నిష్కామకర్మ, నువ్వులూ- తెలకపిండి)

(ఆ) పరస్పర విరుద్ధ భావాలు గల పదాలను జతపర్చి పేర్లను పెట్టడం. (ఉదా: తీయని బాధ, గులాబీ ముళ్ళు)

3. ఇక చివరి పద్ధతి. మూడు గాని అంత కంటే ఎక్కువ పదాలు గాని కలిపి పేరు పెట్టడం. ఇదీ రెండు రకాలు.

(అ) శీర్షికలో వుండే ముఖ్య పదాల మొదటి అక్షరాలు ఒకలా వుండేలా పెట్టడం. (ఉదా: గాలిలో గడ్డిపోచలు, మధ్యతరగతి మనస్తత్వము)

(ఆ) చిన్న చిన్న వాక్యాలను శీర్షికగా వాడడం. (ఉదా: అంతా ఆడవాళ్ళలోనే ఉంది, గింజలు మిగిలాయి.)

అయితే వర్గీకరణంలో ఒక లోపం ఉంది. శబ్దపరంగానూ, వాక్యపరంగానూ తప్ప విషయ పరంగా వింగడింపు జరగలేదు. ఒకటో పద్ధతిలో (ఆ), (ఇ)లు, రెండో పద్ధతిలోని (అ), (ఆ) లు విషయానికి సంబంధించి ఉన్నప్పటికీ వ్యాసకర్త దృష్టి ప్రధానంగా పదాదుల స్వరూపం మీదే నిలిచింది.

మొత్తం మీద కథకు పెట్టే పేరు కథలోని ఏ ఒక్క అంశానికైనా సంబంధించి ఉండక తప్పదు. ఇవి భావన్కోలిరకమై ఉండాలి. ఎక్కువగా కాల్పనికమైతే కథా విషయం మరుగున పడిపోయి, పేరు నిరర్థకమౌతుంది. అందుకే పోరంకి దక్షిణా మూర్తి గారు తన సిద్ధాంత గ్రంథంలో (కథానికా స్వరూప స్వభావాలు)..........................కథ పేరు గురించి చెబుతూ ఇలా అన్నారు.

''While a good title is essential, it is a great mistake to have a starting or sensational title followed a quite little character sketch. Keep the title in it's proper proportions to the nature and intrest of the story.''

-The craft of the short story

(కథానికా స్వరూపస్వభావాలు, దక్షిణామూర్తి పోరంకి)

*<u>3.2 శ్రీపాదవారి కథలు శీర్షికల ఔచిత్యం:</u>*

శ్రీపాద వారు రాసిన చిన్న కథలు మొత్తం 75. డా.. చామర్తి కనకయ్య గారి వింగడింపులో శాస్త్రిగారి కథలు ఏడు విభాగాల్లోకి వచ్చాయి.

1.ప్రణయ కథలు - 5

2.సంఘ సంస్కార కథలు - 25

3.ప్రభోదాత్మక కథలు 8

4.కుటుంబ జీవిత కథలు - 18

5.అపరాధ పరిశోధక కథలు - 3

6.భాషా వివాదాత్మక కథలు - 1

7.అవహేళనాత్యక కథలు - 5

ఇవి 65. ఇంకా చారిత్రక కథల్లో(1) పూర్వ సంస్థాన కథలు - 7

(2) ఆధునిక జమిందారీ కథలు - 3. శాస్త్రిగారు పత్రికల్లో వచ్చిన కథల్ని సంపుటాలుగా ప్రచురించేటప్పుడు చాలా వాటిలో మార్పులు - చేర్పులూ చేశారు. ఆయన పెంపకంలో కొన్ని కథల నిడివి రెట్టింపుకు పైగా పెరిగింది, వాటి అందచందాలూ పెరిగాయి.

**(శ్రీపాద వారి చిన్న కథలు..సమగ్ర సమీక్ష, చామర్తి కనకయ్య)**

ప్రస్తుతం మనం చెప్పుకోబోయేది శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి కథల శీర్షికల ఔచిత్యం. "మనిషి దీర్ఘ జీవితంలో హృదయం మీద అద్దుతుంది చిన్న కథ" అని శ్రీపాద వారు అంటారు. అలా ఎందరో హృదయాలను హత్తుకునేలా కథలు రచించిన వీరు తమ కథలకు ఔచిత్యం ఉట్టిపడే విధంగా శీర్షికలనే పెట్టారు.

అసలు ఔచిత్యం అంటే ఏమిటి? కావ్యాలు మొదలైన వాటిలో అయితే కావ్య శిల్ప లక్షణాలలో శిరోభూషణం ఈ ఔచిత్యం. ఏ పదం ఎక్కడ ఉంటే బాగుటుందో, సందర్భానికి తగినట్లు, అతికినట్లు ఉంటుందో ఆ పదాన్ని అక్కడ వేయడమే ఔచిత్యం. మరి ఇక్కడ ఔచిత్యం అంటే ఏ కథకు ఏ పేరు బాగుంటుందో, "అబ్బ ఈ కథకు ఈ పేరు తప్ప ఇంకేదీ బాగుండదు" అని అనిపించగలుగుతుందో దానినే శీర్షికా ఔచిత్యం అంటారు. కథలోని విషయానికీ, పెట్టే శీర్షికకూ సంబంధం ప్రస్ఫుటంగా కనిపించాలి. అటువంటప్పుడే అది మంచి శీర్షిక అనిపించుకుంటుంది. శ్రీపాద వారు తన కథలలో శీర్షికల ఔచిత్యం ఎంత బాగా పాటించారో పరిశీలిస్తే.....

వీరి మొదటి కథ "ఇరువురమొక్క చోటికే పోదము" విషయంలోకి వస్తే..... పక్క పక్క ఇండ్లలో ఒక యువతి, ఒక యువకుడు చిన్నప్పటి నుంచి కలిసి పెరుగుతారు. వారిద్దరి మధ్యా చిన్నప్పటి నుంచీ ఎంతో అన్యోన్యమైత్రి కొనసాగుతూ... పెద్ద అయిన తర్వాత కూడా అట్లే ఉండి వారితో పాటు పెరిగి పెద్దది అయి ప్రేమగా పరిణమిస్తుంది. వారి తల్లిదండ్రులు కూడా స్నేహంగా కలిసిమెలసి ఉంటారు. వీరికి పెళ్ళి చేయాలని కూడా అనుకుంటారు. కాని ఇంతలో ఏదో అయి వారి తల్లిదండ్రుల మధ్య మనస్పర్థలు వచ్చి విడిపోతారు. పిల్లలను కూడా విడదీస్తారు. అమ్మాయికి అబ్బాయిని కాదని ఇంకొకరితో పెళ్ళి నిశ్చయిస్తారు. కాని అమ్మాయి, అబ్బాయి మాత్రం పెద్దల వలె కాకుండా ఒకరి మీద ఒకరికి ప్రేమ చావక, పెద్దల ప్రవర్తనకు బాధపడుతూ ఏమీ చేయలేక.....ఒకరికి తెలియకుండా ఒకరు తమ ఊరి పక్కన ఉన్న కాల్వలో పడతారు. ఇద్దరూ ఒకరికి తెలియకుండా ఒకరు ఒకేసారి అందులో పడి తిరిగి అక్కడే కలుసుకుని.... బతికి ఎలాగూ కలిసి ఉండలేము, కనీసం చచ్చి అయినా ఇరువురమూ ఒక్క చోటికే పోదము అని నిర్ణయించుకుని చచ్చిపోతారు. ఇక్కడితో కథ అయిపోతుంది. ఈ కథకు ఇంకే పేరు పెట్టినా సమంజసంగా ఉండదు. ఎందుకంటే చివరకు పాత్రలు రెండూ కాల్వలో పడడమూ...... కలిసి చనిపోవాలని నిర్ణయించుకోవడమూ..... వారి ప్రేమ బలం తెలిసేటట్లు ఇద్దరూ

కలిసి ఒక్క చోటికే వెళదాము అనుకోవడమూ కథలోని ముఖ్య సన్నివేశం. ఈ సన్నివేశానికి తగ్గట్టుగానే శ్రీపాద వారు కథకు పేరు పెట్టడం జరిగింది. అందువలన ఈ కథకు ఇదియే సరైన పేరు.

ఇంకొక కథ "వడ్లగింజలు". దీనికి మొదట ఇంకొక పేరేదో పెట్టబడింది. కానీ దానిని మార్చి వడ్లగింజలు అని పెట్టినట్లు శ్రీపాద వారే ఒకచోట తెలిపారు. ఇక కథ విషయంలోకి వెళితే శంకరప్ప అనే బ్రాహ్మణుడు చదరంగంలో నిష్ణాతుడు. అలాగే పెద్దాపురం మహారాజు అయిన శ్రీశ్రీశ్రీ తిమ్మజగపతి మహారాజు కూడా చదరంగంలో మంచి ప్రావీణ్యం కలవాడు. ఈ కథలో ఈ మహారాజు ఒక చాటింపు వేయిస్తాడు. తనతో ఆడి ఓడిపోయిన వాని తల తీయిస్తానని. ఎందుకంటే మహారాజు చాలా మందితో ఆడి.... తనకు సమవుజ్జీ దొరక్క విసిగిపోతాడు. ఈ సమయంలో శంకరప్ప పెద్దాపురం ప్రవేశిస్తాడు. కాని శంకరప్ప బీద బ్రాహ్మణుడు అవడం వల్ల, దివాన్‌జీ అహంకారం వల్ల రాజదర్శనం దొరకదు. తరువాత ఒక పథకం ప్రకారం అతడు పెద్దాపురం మొత్తాన్ని చదరంగంలో తన పాదాక్రాంతం చేసుకుని..... కీర్తి ద్వారా మహారాజుతో చదరంగం డతాడు. ఆరు నెలలు సాగిన వారి ఆటలో మహారాజు ఓడిపోతాడు.

ఇక్కడ నుంచీ అసలు అసలు కథ మొదలవుతుంది. ఓడిపోయిన తర్వాత మహారాజు, శంకరప్పను బహుమానం ఏమి కావాలని అడుగుతాడు. దానికి శంకరప్ప చదరంగానికి అరవై నాలుగు గదులు. మొదటి గదిలో ఒక వడ్లగింజ వుంచండి, తరువాత, రెండో గదిలో రెండు, మూడో గదిలో నాలుగు, నాలుగో గదిలో యెనిమిది, ఇలాగ వెళ్ళిన కొద్దీ రెట్టింపు చేయిస్తూ నాకు వడ్లగింజలు దయచేయించండి అని అడుగుతాడు. ఈ కోరిక తీర్చడం మహారాజుకు అసాధ్యం అవుతుంది. దానికి బదులుగా "దాసోహం" అని తన రాజ్యాన్నే ఇచ్చేస్తానంటాడు. కానీ శంకరప్ప దానిని తీసుకోక ఒక అగ్రహారం కోరుకుంటాడు. ఇంతటితో కథ ముగుస్తుంది. ఈ కథ మొత్తం చదరంగానికి సంబంధించినది. అయితే దీనికి వీరు వడ్లగింజలు అని పేరు పెట్టారు. పేరు చూసి కథ వూహిద్దామనుకునే వారికి ఇది ఎక్కడా అందదు. మరి ఈ పేరు ఎందుకు పెట్టారు? అక్కడే ఉంది అసలు రహస్యం అంతా. శంకరప్ప మొదట మహారాజుగారితో చదరంగం ఆడదామనే వస్తాడు. ఎందుకంటే అక్కడ మహారాజుకి సమవుజ్జీ ఎలా అయితే దొరకలేదో....ఇక్కడ శంకరప్పకూ దొరకరు. కానీ పెద్దాపురం వచ్చాక దివాన్‌జీ కుట వల్ల మహారాజుతో ఆడి దాసోహం అనిపించుకోవాలనుకుంటాడు. చదరంగం ఆడి గెలిచిన తర్వాత ఏదో ఒక మామూలు బహుమానం అడిగిపుచ్చుకుని వెళ్ళిపోతే కథ మామూలు అయిపోతుంది. శంకరప్ప, మామూలు ఆటగాడూ ఒకటే అయిపోతారు. ఇక్కడ శంకరప్ప ప్రత్యేక కనిపించాలి. అంతేకాదు కథకు పట్టు తీసుకురావాలి. అందుకే శంకరప్ప మహారాజుని వడ్లగింజలు అడిగి ఏకంగా రాజ్యాన్నే ఇచ్చేస్తాను అనేంత వరకూ తీసుకుని వస్తాడు పరిస్థితిని. ఇదే కథకు అత్యంత కీలక సన్నివేశం. కథ అంతా శంకరప్ప ధోరణి విశేషంగా ఉన్నట్టు కనిపిస్తుంది. దివాన్‌జీతో మాట్లాడిన తీరు, రాజుగారితో ఆడిన తీరు అన్నీ విశిష్టంగా కనిపిస్తాయి. కానీ చివరి సన్నివేశంలో శంకరప్ప ప్రవర్తించిన తీరు ఎటువంటి వారి చేతనైనా "శభాష్" అనిపిస్తుంది. ఒక్క వడ్లగింజల వల్ల కథలో మొత్తం పరిస్థితి అంతా తారుమారు అయిపోతుంది. అందువల్ల ఈ కథకు ఈ పేరే ఔచిత్యంగా ఉంటుంది. కనుకనే శ్రీపాద వారి అన్నీ కథలలో కంటే ఈ కథే ఎక్కువ పేరు గడించింది.
***(వడ్లగింజలు, శ్రీపాద వారి కథలు రెండో సంపుటం)***

ఇక "కొత్త చూపు" కథ. వరకట్నం ఆశించే యువకులను పెళ్ళాడ్డానికి యువతులు అంగీకరించకూడదనీ, స్త్రీలు, పురుషులకన్నా ఎందులోనూ తక్కువ కాదనే విషయాన్ని గ్రహించాలనీ సందేశాన్నిస్తుంది. అంతేకాదు స్త్రీలు కూడా వ్యాయామం చేసి శారీరక బలాన్ని పెంచుకోవలసిన ఆవశ్యకతను చెబుతుంది. ఈ కథలో శ్రీపాద వారు ఒక యువతి, యువకుడు కుస్తీ పోటీల్లో పాల్గొని బలాబలాలు తేల్చుకునే విషయానికి సంబంధించి ఉదంతాన్ని కూడా చెబుతారు. కథలో ఒక యువతికి వాళ్ళ తాతగారు సంబంధాలు తెస్తుంటారు. అవి ఏరకంగానూ ఎన్నదగినవిగా కనపడవు. వరకట్నం కింద వారు అడిగే వింత వింత కోరికలు ఆమెకు, ఆమె తల్లిదండ్రులకు రోతను కలిగిస్తాయి. ఇది సహించలేని వారు తాతగారితో కరాఖండిగా మరి సంబంధాలు తీసుకురావద్దని చెప్పేస్తారు. తరువాత యువతికి ఆమె

తండ్రి మల్లయుద్ధం నేర్పిస్తారు. ఆ యువతిని చూసి స్ఫూర్తిని పొందిన ఊరి యువకులు, యువతులు కూడా కొంతమంది కూడా కుస్తీలు నేర్చుకుంటుంటారు. కొన్నాళ్ళ తరువాత వారి విద్యా ప్రదర్శన జరుగుతుంది. దీనికి ఊళ్ళో ఉన్న వాళ్ళందరూ ఎగబడి వస్తారు. ఈ ప్రదర్శనలో కథానాయకి తనతోటి విద్యార్థులందరినీ మట్టి కరిపిస్తుంది. అయితే యువతి మాత్రం ఒక యువకుడు చేతిలో ఓడిపోతుంది. ఓడిపోయినందుకు శిక్షగా యువతి తండ్రి ఆమెను ఆ యువకుడిచ్చి పెళ్ళి చేయాలని నిర్ణయిస్తాడు. అంతకు ముందే యువకుడి ప్రతిభాపాఠవాలకు ముగ్ధురాలైన యువతి.... అతనికి మనసర్పించడమే కాకుండా..... పెళ్ళికి మనఃస్ఫూర్తిగా ఒప్పుకుంటుంది. ఇదీ సూక్ష్మమంగా కథ. ఇవాల్టికీ అంతగా మింగుడు పడని యిలాంటి ఉదంతం గల కథను శాస్త్రిగారు ఎప్పుడో ఆ940 లలోనే రాశారంటే ఆయనకు గల "కొత్తచూపు", "ముందుచూపు" ఎలాంటివో తెలుస్తాయి. శాస్త్రి గారి లాంటి వాళ్ళు ఇలా చెప్పినప్పటికీ ఈ విషయం ఇప్పటికీ "కొత్తచూపు"గానే మిగిలింది. కాబట్టి ఈ కథ విషయంలో "కొత్తచూపు" కొన్నాళ్ళు వరకూ కూడా "కొత్త చూపే" అవుతుంది. ***(కొత్తచూపు, శ్రీపాద వారి కథలు మూడవసంపుటం)***

అలాగే "కలుపు మొక్కలు" కథ. దీనికి శ్రీపాద వారు మొదట ఇంకో పేరు పెట్టారు. "తెనుగు రక్తం చప్పబడిపోతూ ఉంది" అన్న పేరుతో దీన్ని మొదట ప్రబుద్ధాంధ్ర పత్రికలో ప్రచరించారు. కానీ తరువాత కథలోని చివరి ప్రకరణాన్ని పూర్తిగా మార్చి "కలుపు మొక్కలు" కథగా తీర్చిదిద్దారు. ఈ కథకు మొదట పెట్టిన పేరు కంటే రెండోసారి పెట్టిన పూర్తిగా న్యాయం చేకూరుస్తుంది. ఎందుకంటే సంఘంలో బాధ్యత గల వ్యక్తులు కొందరు ఎంత అవినీతి పరులో, ఎంత లంచగొండులో నిరూపించే కథ ఇది. సుక్షేత్రమైన పొలంలో కలుపు మొక్కలను ఎలా ఏరిపారేయాలో...... సుక్షేత్రమైన సమాజంలో పేరిగే కలుపు మొక్కలలాంటి వీళ్ళను కూడా అలాగే ఏరి పారేయాలని వీరి ఉద్దేశ్యం. శ్రీపాద వారు ఈ కథలో వేశ్యలను చాలా గొప్పగా, ఉన్నతంగా కూడా చూపెడతారు.

వేదంలో ఘనాపాఠి అనిపించుకున్న ఒక పెద్దమనిషి తన కొడుక్కి బడి పంతులు ఉద్యోగం కోసం వెళితే సబ్‌కలెక్టరూ, ప్రెసిడెంటు వంటి వారు లంచాలు అడుగుతారు. అదీ ఒక వేశ్యను తీసకురమ్మని చెబుతారు. వారు చెప్పిన వేశ్య చాలా సాధువు. అమె ఇలాంటి వారిని తన కాలి గోటితో సమానంగా చూస్తుంది. బాగా చదువుకున్న ఆమె నీతి నియమాలు కలది. ఈ కథలో ఈ పాత్రను శ్రీపాద వారు చాలా ఉన్నతంగా చూపిస్తారు. ప్రెసిడెంటు అసలు స్వరూపం తెలుసుకున్న పండితుడు వేశ్యను వద్దని, వచ్చినందుకు క్షమించమని అడిగి వెళ్ళిపోతుంటే ...... ఆ వేశ్య తన వల్ల ఒక బ్రాహ్మణ కుటుంబం జీవితాంతం బాగా జీవించడం అవుతుందని తెలిసి పనికి ఒప్పుకుంటుంది. వేశ్యా వృత్తిలో ఉన్న ఒక వేశ్య ఇంత ఉన్నతంగా ఆలోచిస్తుంటే....... అధికారంలో ఉండీ పశు ప్రవృత్తి గల వారిని ఏమి చేయాలి? అందుకే శ్రీపాద వారు దీనికి "కలుపు మొక్కలు" అని పేరు పెట్టారు. ఇలాంటి పశు ప్రవృత్తి గల వారందరినీ నిర్దాక్షిణ్యంగా ఏరి పారేయాలని చాటి చెప్పారు. (కలుపు మొక్కలు, శ్రీపాదవారి కథలు మూడవ సంపుటం)

శ్రీపాద వారి మరొక అద్భుతమైన కథ "మార్గదర్శి". ఇందులో శంభుశాస్త్రి పాత్ర ద్వారా మొత్తం కథ అంతా చెప్పిస్తారు. శంభుశాస్త్రి దగ్గరకు ఉద్యోగం కోసం ఒక యువకుడు సిఫారసు కోసం వస్తాడు. అప్పుడు శంభుశాస్త్రి దాస్యవృత్తి కోసం ఆలోచించవద్దని..... తాను కష్టపడి పైకి ఎలా వచ్చినదీ చెప్పి ఆ యువకుడు కూడా పైకి రావడానికి మార్గాలు చెబుతాడు. కుర్రవాడు అతని మాటలు విన్నాడా? లేదా? అన్నది శ్రీపాద వారు రాయలేదు. మనం కూడా ఆలోచించక్కరలేదు. కథలో వీరు నాటి యువకులు ఉద్యోగాల వ్యామోహంలో పడి ఎలా కొట్టుకుపోతున్నారో..... విలువల్ని కోల్పోతున్నారో.......దాని నుంచి ఎలా బయటపడగలరో మొదలగు విషయాలను వివరంగా చెబుతారు. నిజంగా శ్రీపాద వారు కథలో శంభుశాస్త్రి చేత చెప్పించిన విషయాలు నాటి యువతకు మార్గదర్శకాలే. నాటికేమిటి? ఆయన చెప్పిన విషయాలు ఈ నాటికీ, ఎప్పటికీ కూడా మార్గదర్శకాలే. శ్రీపాద వారు చెప్పినట్లు నడుచుకుంటే ఒక్కో యువకుడూ, ఒక్కో యువతీ ఆణిముత్యాల్లా తయారవుతారు. ఈ కథలోని కొన్ని వాక్యాలను మీ ముందుంచుతాను. వాటిని బట్టి ఈ కథకు "మార్గదర్శి" అన్న పేరు ఎంత సబబు అయినదో తెలుస్తుంది.

"నేను, నాది అనే భావాలు ఆది నుంచీ వుంటాయి మనిషికి. అయితే నీ అహంకారానికి గల సత్తా ఏ పాటిదో, నీ మమకారానికి గల ధారుఢ్యం యెంతటిదో యెప్పుడైనా చర్చించుకున్నావా నువ్వు?"

"ఐహిక జీవితం జయావహంగా గడుపుకోవాలంటే ఆత్మజ్ఞానం యెంత అగ్యమైనదో, అంత మంది గురువులైనారు కదా, వొక్కరయినా చెప్పారా నీకు?"

"దరిద్రం అంటే డబ్బు లేకపోవడం కాదు, బుద్ధి లేకపోవడం. బండరాయి చూస్తే దీన్ని కదపగలమా? అనిపిస్తుంది. కానీ బుద్ధి ఉంటే దాన్ని కొండ మీదకే ఎక్కించవచ్చు సునాయాసంగా. సాగదీసి దాన్ని ఒక్క తన్ను తన్నితే మన కాలు పిప్పి అయిపోతుంది. అలా కాక, ఓపిక పట్టి దాని మీదుగా నడవడం ప్రారంభిస్తే తుక్కు తుక్కు అయిపోతుంది, పిప్పి అయిపోవలసిన ఈ కాలి రాపిడికే అది అరిగి పచ్చడిబద్ద అయిపోతుంది".

"ప్రపంచమే ద్వంద్వ భూయిష్టం. సుఖం ఉన్నచోట కష్టమూ, కష్టంలో సుఖమూ ఉంటూనే ఉంటాయి."

"ఆధ్యాత్మిక దృష్టి ఎప్పుడేర్పడ్డదో అప్పుడే మనకి పతనం ప్రారంభం అయింది. జగత్తు అంతా మిధ్య అనుకుని నిర్లిప్తత పట్టుకు పాకులాడే వాళ్ళకి బానిసతనం కాకపోతే మరేం సిద్ధిస్తుంది?"

"అయిన ఇంట పుట్టి తక్కువ పని చెయ్యనా? అన్న అభిజాత్యం ఎక్కడ ఉంటుందో అక్కడ సర్వనాశనమే. డబ్బుంటేనే తక్కినవి ఏమయినా నిలుస్తాయి."

"ఈ లోకంలో పుట్టీ, ఇది అస్థిరం అనీ, డబ్బు క్షుద్రం అనీ, జీవితం నీటి బుడగ అనీ నిరసించడం తెలివి మాలిన పని."

"ఇది స్వర్గం చేసుకోలేని వాడు, అక్కడ స్వర్గం అంటూ ఉంటే అది మాత్రం ఎలా సాధించుకోగలుగుతాడు?"

"మనిషి వల్ల వర్తకం పాడవుతంది కానీ..... వర్తకం వల్ల మనిషి ఎన్నడూ పాడయిపోడు."

"మన వీలు చూసుకోవాలి మనం. కానీ లోకం పోయిన తోవనే పోవడం ఏమి ప్రయోజకత్వమూ?"

"పంతులూ! ఎవడి బోర కింద కిందికెవడుతోడుకోవడం మాంతాడూ? స్వార్ధమే ఐహిక జీవితానికి మూలం. స్వార్ధే జీవిత విజయానికి కీలకం. హద్దు మీరనంత వరకూ తనకి కావాలనుకోవడం అసహజం కాదు. తప్పంతకంటే కాదు. ఈ హద్దు నిలుపుకోలేని వారు వైరాగ్యంలో కూడా నెగ్గలేరు. వైరాగ్యానికి కూడా హద్దుంది. ఎండుతూ, మాడుతూ తొరగా చచ్చిపోవాలనుకోవడం కాదు వైరాగ్యం".

"ఈ జీవితానికి పరమార్ధం ఆనందం. చూపెప్పుడూ దాని మీద వుండాలి. అక్రమాలకి దిగుతామా.... పరమార్ధం భ్రష్టు అయిపోతుంది. సభ్యత అలవరుచుకుంటే ఈ అపాయం తటస్థించదు. దరిద్రుల మధ్య నివసించే ఐశ్వర్యవంతునకు సౌఖ్యానందాలు సిద్ధించవు. వాడి బతుకు గర్వంతో పొగచూరిపోతూ ఉంటుంది. సంశయాలతో రగిలిపోతూ ఉంటుంది. అపభ్రంశాలోచనలతో మండిపోతూ ఉంటుంది. స్వయంకృతాపరాధాలతో చివరకు నుసి అయిపోతుంది".

ఈ కథలోని ప్రతీ వాక్యం అక్షర సత్యాలు. ఆలోచిస్తే ప్రతీ వాక్యం, అక్షరం కూడా మన జీవితాలకు "మార్గదర్శకాలు" అవుతాయి. (మార్గదర్శి, శ్రీపాద వారి కథలు రెండవ సంపుటం)

శ్రీపాద వారు తన కథలు కొన్నింటికీ సంస్కృత పదాలను కూడా పేర్లుగా పెట్టారు. "శుభికే శిర రోహ", "కన్యాకాలే యత్నా ద్వరితా", "షట్కర్మ యుక్తా"..... ఇలా. ఇందులో "శుభికే శిర రోహ" అన్న కథ హిందీ ఏలుబడి గూర్చి. "శుభికే శిర రోహ" అన్నది అంతా అయిపోయాక చివరన హారతి ఇస్తూ మంగళం పలికే శ్లోకం. ఇందులో వీరు హిందీని, హిందీ వారి ఏలుబడిని నిరసిస్తూ...... దానికి మంగళం పలకాలని చెప్పేటటువంటి కథ ఇది. అందవల్లనే ఈ కథకు ఈయన "శుభికే శిర రోహ" అని పేరు పెట్టారు.

చివరగా "జోడు" అన్న కథ దగ్గర ఆగిపోతాను. కొచ్చెర్ల కోట వేంకట రాయణింగారని ఒక ప్రభువు. పెద్ద పులి ముఖం కప్పుకున్న గోవులాంటి వారాయన. ఈయనకు ప్రతీ యేటా శివరాత్రికి పట్టిసంలో భారీస్థాయిలో అన్న సంతర్పణ చేయిస్తుండడం - ఆనవాయితీ. అలాగ సంతర్పణకు ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. పైకి ఈనె పుల్లలా ఉన్నా రాశిపోసినా ఇంకా రానిమ్మనే జఠరదీప్తి కలవాడు. ఈ సంతర్పణలో ఇంకొక ప్రత్యేకత వీసె బూరెలు. తూకంలో ఇవి ఒక్కోటి వీసెకు తగ్గదంటే తగ్గదు. ఇప్పుడు ఈ క్రింద చెప్పబోయే సన్నివేశం కథకు కీలకం. ఇది చదివిన తర్వాత శ్రీపాద వారు ఈ కథకు ఎంత చమత్కారంగా పేరు పెట్టారో అర్థమవుతుంది.

"బ్రాహ్మణుడు బూరెలు చిదపడం మొదలుపెట్టాడు"

"దడ దడ నాలుగు బూరెలు పడ్డాయి."

"చూసుకో ! పడాలి".......

"మరో రెండు దుమికాయి"..........

"ఏమంటావ్?" ......

"ఇదంతా బ్రాహ్మణుడికి పితలాటకంగా కనబడింది. పడవలసిన బూరెలలో ఇంకా సగమేనా పడలేదు. ఈ కొసరడం అతనికి విసుగెత్తించింది".

"మహారాజు భరద్వాజ విందు చేస్తూ ఉంటే వీళ్ళ సొమ్మేం పోయింది అనిపించింది".

"మొగం పైకెత్తి ఒక్క క్షణం ఎర్రగా చూసాడు".

"ఉత్తర క్షణంలో చాల్లేవోయ్! నేర్చుకు పోయావు............ అంటూ గదుముతూ ఎడమ చేత్తో వోడిసి పట్టుకుని వొంచేసుకున్నాడు. అది చూసి కొందరు తెల్లబోయారు. ఇద్దరూ కలియబడతారని కొందరు జడిసిపోయారు".

"ఇంత వరకూ బాగానే ఉంది. కానీ ఇంతలో తోటి బ్రాహ్మణులు వచ్చి ఓరి నీ బతుక్కాలా ! అంత మోటిపని చేశావేమిరా ! ఆయనే రాయణింగారు. ఇక నీ పనికైతే...... అంటూ అతని నెత్తి మీద పిడుగులు కురిపించి చక్కా పోయారు".

"దీంతో బ్రాహ్మణుడికి ఎక్కడలేని భయం పట్టుకుంటుంది. భోజనాలయిన తరువాత దొడ్డి సంభావన. భయపడుతున్న బ్రాహ్మణుడు ఎలాగైనా తప్పించుకోవాలనుకుంటాడు. రాయణింగారు ఇతని కోసమే ఎదురు చూస్తుంటారు. చివరకు ఆయన బక్క మనిషి చెయ్యి ఒడిసి పట్టుకుని నువ్వే కాదూ బుట్టవొంచేసుకున్నావూ? అని అడిగి ప్రక్కనే గుమస్తాని 'జోడు' తేవోయ్ ఆజ్ఞ జారీ చేస్తారు".

"చెప్పుల జోడా....... సంకెళ్ళ జోడా...... అని అక్కడున్న వారందరికీ కంగారు పట్టుకుంటుంది".

"గుమస్తా జోడు తెచ్చాడు".

"రాయణింగారు కుడి చేయి చూపారు".

"జేబులోంచి గుమస్తా జోడు తీసాడు".

"అందరి కళ్ళూ జిగేల్మన్నాయి".

"చూడగా అది రత్నాలు తాపిన మురుగుల 'జోడు'. చూసేవాళ్ళకి గుండె ఓ నిముషం ఆగి - మళ్ళీ కొట్టుకుంటుందేమో అన్నంత కొస మెరుపు". ఇదీ కథ.

దీనికి శ్రీపాద వారు "జోడు" అని పేరు పెట్టారు. అసలు కథ చూడగానే ఇదేంటిరా బాబూ "జోడు" అని పేరు పెట్టారు.... ఏమై ఉంటుందా? అని ఆసక్తిని రేకెత్తిస్తుంది. కథ చదివేటప్పుడు "జోడు" పట్టుకురా అనగానే మనకు కూడా అక్కడి వారికి కలిగిన

అనుమానమే కలుగుతుంది. మరి ఈ కథకు "జోడు" అన్న పేరు కాక ఇంకొక పేరు పెడితే అనుభూతి కలుగుతుందా? అందుకే వీరు ఎంతో చమత్కారంగా దీనికి ఈ పేరు పెట్టారు. (జోడు, పుల్లంపేట జరీచీర కథల సంపుటం)

ఇదీ శ్రీపాద వారి కథల శీర్షికలు - ఔచిత్యం. ఇవి కాకుండా ఇంకా గులాబీ అత్తరు, గుర్రప్పందాలు, అరికాళ్ళ కింద మంటలు, తాపీమేస్త్రీ రామదీక్షితులు బి.ఏ........ మొదలగునవి అన్నీ గొప్ప శీర్షికలు కలిగిన కథలు. శ్రీపాద వారి 75 కథలకు పెట్టిన పేర్లూ ఔచిత్యంగానే ఉంటాయి. అన్ని కథలూ చెప్పకోదగ్గవే. కానీ ఇలా చెబుతూ పోతే ఈ ఒక్క విషయమే ఒక సిద్ధాంత గ్రంథం కింద తయారవుతుంది. అందుకే ఇక్కడితో ముగించవలసివచ్చినది.




# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి భాషా నేపథ్యం - దృక్పథం

- ఆలమూరు మనోజ్ఞ

(3)

## వాక్య నిర్మాణం

భాష గురించి చెప్పుకుంటున్నప్పుడు ముఖ్యంగా మనం గమనించవలసినది వాక్యం, వాక్యనిర్మాణం గూర్చి. వాక్య నిర్మాణం ప్రధానంగా కథ యొక్క కథనం మీద ధారపడి ఉంటుంది. కాబట్టి ముందు కథనం అంటే ఏమిటో తెలుసుకుంటే దాన్ని బట్టి వాక్య నిర్మాణాన్ని పరిశీలించడానికి మార్గం సుగమం అవుతుంది.

*కథనం:*

కథనం అంటే చెప్పడం. వివిధమైన కథాంగాల్లో కథనం ఒకటి. ఎవరైతే కథ చెబుతారో వాడు కథకుడు లేదా రచయిత. కథా రచయిత కథకుడు కావచ్చును. కానీ ప్రతి కథకుడూ రచయితే కానక్కరలేదు. ఎందుకంటే రచయిత, కథకు దూరంగా ఉండి పాత్రల ద్వారా కథనం నడపడానికి అవకాశం ఉంది. అప్పుడు పాత్రే కథకుడు అవుతాడు. ఈ కథనం స్వగతం, సంవాదాల్లోనూ ఉండవచ్చును. తనలో తాను మాట్లాడుకుంటే స్వగతం. కొన్ని పాత్రలు మాట్లాడుతూ కథ చెబితే సంవాదం. ఇవన్నీ రచయిత కథనంలోకి పర్యవసిస్తాయి. కానీ వీటిలో రచయిత పైకి ఎక్కడా కనిపించడు. సమయ సందర్భాలను బట్టి, వైయక్తిక స్వభావాలను బట్టి పాత్రల మాటలూ, చేతలూ, ఆలోచలూ ప్రస్ఫుటం అవుతూ ఉంటాయి. వీటిలో రచయిత జోక్యం చేసుకోడు. అందువల్ల రచయిత కథనం రెండు రకాలుగా ఉంటుందని చెప్పవలసి ఉంటుంది.

1)ప్రత్యక్ష కథనం

2)పరోక్ష కథనం.

రచయితే కథక స్థానంలో ఉండి చెప్పేది ప్రత్యక్ష కథనం. కథాగతమైన పాత్ర, సన్నివేశం మొదలైన వాటి ద్వారా చెప్పేది పరోక్ష కథనం. కాబట్టి ఒక రకంగా చూస్తే పాత్రల స్వగతాలు, సమ్వాదాలు కూడా పరోక్ష కథనం తాలుకు రూపవైవిధ్యాలేనన్న విషయం స్ఫురిస్తుంది.

పై పరిశీలన ప్రకారం కథకుడు చెప్పిందే కథనం అన్న విషయం స్పష్టమౌతుంది. దీన్నే హారీ షా ఇలా నిర్వచిస్తాడు.

''A form of discourse the principal purpose of which is to relate an event of series of events. Narration, from Latin word meaning to tell, is also called narrative, which way be used as adjective or a noun………''

(కథానికా స్వరూపస్వభావాలు, పోరంకి దక్షిణా మూర్తి)

కథా దృక్పథాన్ని బట్టి కథనం స్థూలంగా రెండు రకాలు.

ఆ)ప్రథమ పురుష కథనం (Third person narration)

కథలో ప్రత్యక్ష ప్రమేయం లేకుండా కేవలం సాక్షీభూతుడుగా నిలిచి కథకుడు చెప్పేది ప్రథమ పురుష కథనం. ఇందులో వివిధ పాత్రలను ప్రస్తావించే సందర్భంలో కథకుడు ఆయా పాత్రలను పేర్లతో చెప్పడం కానీ, అతడు, వాళ్ళు మొదలైన సర్వనామాలతో చెప్పడం కానీ జరుగుతుంది.

ఉదా: పాలగుమ్మి పద్మరాజు గాలివాన కథ

2)ఉత్తమ పురుష కథనం (Frist person narration)

కథలో పాత్ర అయినవాడు తన ఉనికి తెలిసేటట్లుగా చెప్పే కథనం. దీంట్లో తరుచుగా నేను/మేము అన్న ప్రస్తావన సాగుతూ ఉంటుంది. పాత్ర భావాలు అతని మాటల్లో వెలువడుతూ ఉంటాయి.

ఉదా: బుచ్చిబాబు అడవి కాచిన వెన్నెల

ఈ పాత్ర కథలో ప్రధానమైది కావచ్చు, అప్రధానమైనది కావచ్చు. పాత్ర స్వభావాన్ని బట్టి గాని, కథలో గల ప్రాధాన్యాన్ని బట్టిగాని కథన దృక్పథం ఏర్పడుతుంది.

ఈ రెండూ కాక, మధ్యమ పురుష కథనాన్ని గురించి కూడా చెప్పారు. (Second person narration) నిన్ను ఒక కథానాయకుడిగా చేసి కథ చెప్పినట్టయితే అది ఈ రకం కథ కిందకి వస్తుంది. ఈ రకపు కథలు తెలుగులో చాలా కొద్దిగానే రాయబడ్డాయి. చెప్పే విషయం యావత్తు ఎదుటి వ్యక్తి గురించి చెపుతూ, అతనితోనే చెపుతూ, తన ఉనికిని కాని అన్న వ్యక్తి ఉనికిని కానీ లేకుండా పూర్తిగా ఎదుటి వ్యక్తి గురించే సాగే కథనాన్ని మధ్యమ పురుష కథనం అని చెప్పవలసి ఉంటుంది.

మొత్తం మీద , ఎవరికో సంబంధించిన వృత్తాంతాన్ని ఇతరుడెవరో చెబుతున్నట్టుగా, అది మన కళ్ళ ముందే జరుగుతున్నట్టుగా గానీ సాగే కథనాన్ని ప్రథమ పురుష కథనమని, రచయిత గాని, పాత్ర గాని తాను చూసినట్టుగానో ,అనుభవించినట్టుగానో, మనస్సులో ఉన్న స్వవిషయం బయల్పరుస్తున్నట్టుగానో సాగే కథనాన్ని ఉత్తమ పురుష కథనమని , ఈ రెండూ కానిది మధ్యమ పురుష కథనమనిపై పరిశీలన వల్ల తెలిసింది.

*శ్రీపాద వారి కథన పద్ధతి, శైలి:*

ముందు చెప్పినట్లుగా కథన పద్ధతులు అన్ని రకాలు ఉన్నప్పటికీ శ్రీపాద వారు అవేవీ పెద్దగా పాటించినట్లు అనిపించదు. ముందు చెప్పిన నియమాల ప్రకారం అయితే వీరి కథనం పరోక్ష కథనం కిందకి వస్తుంది. వీరి కథనం అంతా సంభాషణల ద్వారా జరుగుతుంది. సంవాదం / సంభాషణలు అనేవి పరోక్ష కథనం కిందకు వస్తాయి. కాబట్టి వీరిది అదే అని చెప్పవలసి ఉంటుంది.

*శైలి:*

మాట్లాడేటప్పుడు కాని, రాసేటప్పుడు కాని భాషాభివ్యక్తిలో కనబడే తీరును శైలి అంటాం. పదాలు, పదాంశాలు, పదబంధాలు, వాక్యాంశాలు, వాక్య నిర్మాణాలు, అలంకార ప్రయోగాల రకాలు, వాటి తరుచుదనం, శబ్దాలంకారాలల్లో పొడగట్టే లయ లేక తూగు పొందిక మొదలైన వాటి ఎంపికలో శైలి ద్యోతకమౌతుంది. శైలి అనగా కవి యొక్క జీవలక్షణము.

(కథానికా స్వరూపస్వభావాలు, పోరంకి దక్షిణామూర్తి)

ఉచ్ఛారణ పద్ధతి మొదలు, వాక్య నిర్మాణ విధానం వరకు వివిధ స్థాయిల్లో, వివిధ రీతుల్లో కవి శైలి ద్యోతకమౌతుంది.

శ్రీపాద వారిది సంభాషణ శైలి. వీరి కథలో పాత్రలు కథను చెబుతూ ఉంటాయి. పాత్రల మధ్య జరిగే సంభాషణను సంవాదం అంటాం. పాత్రల మనస్సులో ఉన్న అభిప్రాయాలను, వారి ఆలోచనా ధోరణులను, విశ్వాసాలు మొదలగు వాటిని నోటి మాటల ద్వారా వ్యక్తం చేసేది సంవాదం. సహజత, ఔచితి, వ్యవహారికత అన్నవి మూడూ దీంట్లో ప్రస్ఫుటం అవుతాయి. పదాల్లో, పదబంధాల్లో, వాక్యాల్లో, వాక్యాంశాల్లో ప్రతీ ఒక్కటీ తూచి తూచి ప్రయోగించడంలో రచయిత నేర్పరితనం కనిపిస్తుంది. శ్రీపాద వారు తన కథలలో ఒక్క మార్గదర్శి తప్ప మిగిలిన వాటన్నింటినీ సంవాదంతోనే నడిపించారు. దీంట్లో వీరు సిద్ధహస్తులు.

సాధారణంగా మాట్లాడుకునే మాటలు కథల్లో కర్షణీయంగా ఉండవు. మనం మాట్లాడే మాటలన్నీ వ్రాయించి తిరిగి చదువుకుంటే అవి ఎంత అసంబద్ధంగానూ, అవకతవకగానూ ఉంటాయో మనకు తెలుస్తుంది. అందుచేత సంభాషణలోని నిగ్గునే కథల్లో చెప్పాలి. నిజంగా ఎలా మాట్లాడుతారో.....కథానికలో సంభాషణ అలా ఉండాలన్న మాట వాస్తవం, కాని ప్రత్యేక సన్నివేశాల్లో ఏదో ఒక ఉద్రేకం యొక్క ప్రభావం కింద మాట్లాడిన మాటల నిగ్గు సంభాషణలో ఉండాలి. అలాగని సంభాషణ అతి తెలివిగా ఉండకూడదు. దానివల్ల కథలో వాస్తవికత నశిస్తుంది.

(ఆంథోని ట్రాలప్, కథానికా స్వరూప స్వభావాలు, పోరంకి దక్షిణా మూర్తి)

పైన చెప్పిన లక్షణాలన్నీ శ్రీపాద వారి కథల్లో మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. తిక్కన భారతం చదువుతుంటే అందులోని పాత్రలు మన ముందు నిలబడి మాట్లాడుతున్నాయా అన్నంత అనుభూతికి లోనవుతాం. అలాగే శ్రీపాద వారి కథలలో సంభాషణలు కూడా మనకు ఇదే అనుభవాన్ని కలిగిస్తాయి. కేవలం సంవాదం ద్వారా కథ నడిపించడం, పాత్రల భౌతిక, మానసిక స్థితులను ఆవిష్కరించడం అన్నవి యథాలాపంగా చేయడం కాకుండా దాన్నొక అసిధారా వ్రతంగా నిర్వహించిన వారు శ్రీపాద. ఉదాహరణకు షట్కర్మయుక్తా అన్న కథలో ఆలుమగల మధ్య సంభాషణను తీసుకుందాం.

‘‘ఏం చేస్తున్నావ్?‘‘

‘‘ఏం చేయమన్నారు?‘‘

‘‘సున్నం కావాలి.‘‘

‘‘తెచ్చుకోవాలి.‘‘

‘‘నువ్వెందుకు తేవూ?‘‘

‘‘మీరెందు తెచ్చుకోరూ?‘‘

‘‘ఎక్కడో వుంటే‘‘.....

‘‘ఎక్కడో యేమిటి, సందులో కుండలో వుంటే‘‘......

‘‘నాకా సంగతి తెలుసు, నువ్వు తేవాలి‘‘

''నాకూ తెలుసు ఈ సంగతి, మీరు తెచ్చుకోవాలి''

''తెచ్చిపెట్టమని చెబుతున్నాను వినపడదూ''

''మడి కట్టుకున్నాను కనపడదూ''

''మడికట్టుకునిప్పుడేమి చెయ్యాలి నువ్వూ?''

''మీరలా కూచుని మాత్రంయేమి చెయ్యాలండే మహా?''

''కారణం చెబితేనే మైలపడిపోతా?''

''చెబితే మీకేమైనా కలిసివస్తుందా?''

''అయినా చెబుదూ చూద్దాం''

''పనిమనిషికి అంట్లు పడేయ్యాలి''

''పడేసి?''

''పొయ్యి అలకాలి''

''అలికి?''

''ముగ్గు''

''పెట్టి?''

''సడే నిప్పు పడేయ్యాలి''

''పడేసి?''

''ఎసరు''...

''పెట్టి?''

''కుంభం వుడకెయ్యాలి కదూ? ఏది తప్పినా అది తప్పదాయె మనకి. మూడు పూట్లా రగింపయితే గాని తిరువీధులు వేంచేయ్యడానికి స్వామికి శక్తి పుట్టుకురాదుగా?''

(షట్కర్మ యుక్తా, మెదటి సంపుటం)

ఇలా ఒక దాన్ని అంటుకుని మరోకటి చొప్పున పేలే సీమటపాకాయల్లాంటి సంవాదులు నడిపించడం శ్రీపాద వారికి వెన్నతో పెట్టిన విద్య. శ్రీపాద వారి రచనా శైలిని, వాక్య నిర్మాణాన్ని అద్భుతంగా చూపించే కథ వడ్లగింజలు.

ఇందులో శంకరప్ప అనేవాడు మహారాజుతో చదరంగం ఆడాలని కోరికతో దివాన్‌జీ వద్దకు అవకాశం ఇప్పించమంటూ వెళతాడు. అప్పుడు అక్కడ ఉన్న ఠాణేదారు శంకరప్పను అడ్డగిస్తూ ఉంటే దివాన్‌జీ ''ఏమిటని అడుగుతాడు''. అప్పుడు శంకరప్ప ''వొక్క క్షణం మాట్లాడడ్డం తప్ప మరేమీ అక్కర్లేదని చెప్పవయ్యా'' అని కేకేస్తాడు. ఇక్కడ శంకరప్ప ఠాణేదారుని ఏకవచన ప్రయోగం చేస్తాడు. ఏక వచన ప్రయోగం అధికారంలో ఉన్నవారికి గొప్ప పరాభవం కింద లెక్క. ఇది విని ఠాణేదారు బాగా కుంగిపోతాడు. ఇది శ్రీపాద వారి రచనా శక్తికి నిదర్శనం.

శ్రీపాద వారి వర్ణనా వాక్యరచనలో వస్తువు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుంది అనడానికి ఒక ఉదాహరణ వడ్లగింజలు కథలోనే ఉంది. ఇందులో దివాన్‌జీకి ఒకచోట శంకరప్పతో మాట్లాడడం ఇష్టం ఉండదు. ఇతనితో మాట్లాడి చాలా తప్పు చేసానని బాధపడుతుంటాడు. అప్పుడు శ్రీపాద దివాన్‌జీ బాధని కొన్ని పనుల చిత్రీకరణ ద్వారా చూపిస్తారు.

''మాట్లాడవలసిన వారు తన ఎదుట ఎవరూ లేనట్టు నటిస్తూ, అతనొక కాగితం తీసాడు. ఒకటి రెండు బంతులు చదివాడు. కానీ దృష్టి దాని మీద నిలవలేదు.

ఒక మాటు కాగితాలు సద్దాడు. మరోమాటు వైపు కాగితాలు సద్దాడు.  కానీ బొత్తి సరిగ్గానే ఉందే, యెందుకీ పాట్లు? అని ఎవరో అడిగినట్టయి అది వొదులుకున్నాడు. ''

''పొడుముకాయ కారలి కిందకు దొర్లి పోయి ఉంది. అది తీసి అనవసరం అనుకుంటూనే వొక్క పట్టు పీల్చాడు. ఛరుమని నసాళం అంటి చురుకు పుట్టింది. ఫోఫో అనేద్దామనుకున్నాడు, గాని ప్రతిష్ఠ పీకింది.''

''పెట్టె మూత తెరిచి అరలో బత్తాయి చాకు, కంతాణి పైకి తీసి మళ్ళీ పెట్టేస్తాడు. బాతుకలం తీసి చెక్కుదామనుకుని మళ్ళీ పడేస్తాడు''

''వొడిలో ఉన్న తాళాల గుత్తి పక్కన పడేశాడు. పక్కనే వున్న పొడుముకాయ రొంటిని పెట్టుకున్నాడు. సిరాబుడ్డీ కొంచెం జరిపాడు. అటువున్న యిసక డబ్బీ యిటు పెట్టాడు.''

ఇలా అప్పడు దివాన్‌జీ యొక్క మానసిక విలాసాలన్నీ శ్రీపాదవారు మనకు కళ్ళకు కట్టినట్టు చూపిస్తారు. సంభాషణలు రాయడంలో వీరు ఎంత ప్రతిభావంతులో అవసరమైన చోట వ్యక్తుల మానసిక పరిస్థితులను విశ్లేషించడంలో కూడా అంతే ప్రతిభను కలవారు. అలాగే వాక్య నిర్మాణం గొప్పతనం ఈ కథలో ఇంకొక చోట కూడా గొప్పగా చూపిస్తారు.

శంకరప్పని దివాన్‌జీ మహారాజుతో ఆడడానికి అనుమతి ఇవ్వడు. అపుడు పెద్దమ్మ శంకరప్పకి గొప్ప సలహా ఇస్తుంది. దానిని పాటించడానికి శంకరప్ప వెళతాడు. అప్పుడు శంకరప్ప ఉత్సాహాన్ని శ్రీపాదవారు ఇలా ప్రకటిస్తారు.

''వాకిట్లోంచి గుమ్మంలోకి వొక్కటే వురక, అక్కణ్ణించి వీధిలోకి వొక్కటే అంగ.''

అంటే శంకరప్ప అంత వేగంగా పరిగెట్టాడన్నమాట. మరి ఇదే మాటను ఇంకోలా చెబితే ఇంత అందంగా ఉంటుందా? ఇలాంటి చోట్లలోనే శ్రీపాదవారికి మిగతా వారికి తేడా తెలుస్తుంది. వీరి వాక్య నిర్మాణ చాతుర్యం అవగతమౌతుంది.

తర్వాత ఎలాగైతేనేం శంకరప్ప, మహారాజుతో చదరంగం ఆడతాడు. అప్పుడు వారిద్దరి మానసిక పరిస్థితిని శ్రీపాద వారు ఇలా వర్ణిస్తారు

''మరెవరితో ఆడినా మహారాజుకి గువ్వపిట్టల వేటలా ఉండేది. శంకరప్పకి వోనమాలు దిద్దించడంగా కనపడేది. కాని, ఇప్పుడు మహారాజుకి కొండను తాకినట్టయింది. శంకరప్పకి బ్రహ్మ విద్యలో పడ్డట్టయింది.''

ఇక్కడ శంకరప్పకి, మహారాజుకి కూడా చదరంగం ఒక అభిరుచి మట్టుకే. కాని వారి వారి అసలు వృత్తులు మాత్రం ఒకరిది పరిపాలన, ఇంకొకరిది విద్య నేర్పడం. అందుకే శ్రీపాద వారు చదరంగం ఆడుతున్నప్పుడు వారి వృత్తులతో పోలుస్తూ వారి వారి మనఃస్థితులను చెప్పారు.  ఇక్కడ పోలిక ఎంతో అందంగానూ, సమంజసంగానూ కనపడుతుంది.

శంకరప్ప, మహారాజుల ఆట ఆరు నెలలు సాగుతుంది. ఒకరోజు మహారాజుకి హఠాత్తుగా ఏదో ఆలోచన వచ్చి శంకరప్పని తీసుకురమ్మని చెపుతాడు. అప్పుడు శంకరప్ప ఒకే ఒక మాట అంటాడు.

''శంకరప్ప ఏనుగెక్కేగాని, గుర్రం ఎక్కి వెళ్ళడోయ్''

శ్రీపాదవారు కథంతా శంకరప్ప చేత ఇలాంటి వాక్యాలు చాలా అనిపిస్తారు. ఇక్కడ మహారాజు ఓటమిని తెలియజేస్తూ, శంకరప్పకి చదరంగం మీద పట్టు మనకి తెలిసే విధంగా ఈ వాక్యం రచించారు.

(వడ్లగింజలు, రెండవసంపుటం)

శ్రీపాద వాక్య నిర్మాణంలో ఉన్న ఇంకొక విశిష్టత కూడా మనం తప్పక చెప్పుకోవాలి. ఈయన తన కథల్లో వాక్యాలను రచించేటప్పుడు చుక్కలు, కామాలు, ప్రశ్నార్థకాలు, ఆశ్చర్యార్థకాలు మొదలగు వాటిని కూడా వాక్యాలుగా చూపిస్తారు. అంటే వీరికి అవి అక్షరాలలాగ సంకేతాలు, అర్థాలున్న మాటలు అన్నమాట. ఉదాహరణకి.......

*వ్యవధి సూచకాలు:*

వ్యవధి సూచకాలు అంటే పదంలో అక్షరాల మధ్యగాని, పదాల మధ్య గాని వ్యవధిని సూచిస్తూ ఒక గీతను పెట్టడం. మనం మాట్లాడేటప్పుడు కొన్ని పదాలను మధ్య మధ్య ఆపిగానీ, సాగదీసి గానీ ఇలా అనేక రకాలుగా ఉచ్చరిస్తాము. దాని వల్ల పదాలు మరింత ప్రాముఖ్యం సంతరించుకుంటాయి. చదివే వారికి కూడా రచయిత భావం స్పష్టంగా బోధపడుతుంది. ఈ స్పష్టత కలగడానికి ఉపయోగపడేవే వ్యవధి సూచకాలు. వీటిని శ్రీపాదవారు తన రచనలలో బాగా ఉపయోగించుకున్నారు. ఇక్కడ అలాంటివి కొన్ని వారి కథల్లో నుంచి.........

*ఉదా 1:*

''డబ్బు అక్కర్లేదుటండీ''...

''మరేం కావాలిట?''

''చెప్పలేదండీ''

''అడిగావా నువ్వు? లే_దే_ం?''

''చేతులు నులుపుకుంటూ ఇలా నసికాడు ఠాణేదారు.''

(పేజీ నం:2, వడ్లగింజలు కథ, రెండవసంపుటం)

*ఉదా 2:*

''ఒక్క క్షణం ఓపిక పట్టు, వంట అయి''...........

''....................................................''

''.........................................................''

''వాకిట్లోంచి గుమ్మంలోకి వొక్కటే వురక. అక్కణ్ణుంచి వీధిలోకి వొక్కటే అంగ.''

(పేజీ నం:ఆ3, వడ్లగింజలు)

ఉదా 3:

''చిత్తం చిత్తం.''

''ఇంకా నుంచున్నావు?''

''లే_ద్_మ''......

''జగప్పు మాటకంటే ముందే వుడాయించాడు.''

(పేజీ నం: 72, వడ్లగింజలు)

పై మూడు చోట్లా వ్యవధి సూచకాల వల్ల అక్కడ ఉన్న పాత్రలు మనమే అయి నసికినట్లు, పరుగెత్తినట్లు అనుభవానికి లోనవుతాం.

అలాగే ''చె_ బ్తా '', ''పే_ద్ధ'', ''ధ_న్ను'', ''చా_ప్ప''గా ఇలాంటి చోట్ల కూడా వ్యవధి సూచకాల వల్ల చదివే వారు వాటిని సాగదీసి చదువుతారు. దీని వల్ల కథకుడు చదువురులకు ఏ భావం అయితే చెప్పదలుచుకున్నాడో అది సులువుగా అవగతమౌతుంది. ఇవన్నీ శ్రీపాదవారి కథల్లో మనకు ఎక్కడ చూసినా కొకొల్లలుగా కనపడతాయి. అంతెందుకు తన కథలలో ఒక దాని పేరులో కూడా వ్యవధి సూచకాన్ని ఉపయోగించారు. అది ''ఎక్క_డా లొంగలేదు.''

*__మానసికావస్థ సూచకాలు, ప్రతిస్పందన సూచకాలు:__*

శ్రీపాదవారి కథలు సంభాషణా శైలి అని ముందే చెప్పుకున్నాం. ఈయన తన కథల్లో ప్రతీ సంభాషణా రాసేయకుండా చదువరి బుద్ధికి కొంత వదిలిపెట్టేస్తారు. అవే మానసికావస్థ, ప్రతిస్పందన సూచకాలు. అంటే ఇద్దరి మధ్య సంభాషణ నడుస్తున్నప్పుడు ఒకరు మాట్లాడుతుంటారు. అప్పుడు రెండవ వారిలో కలిగిన మానసికావస్థను గానీ, ప్రతిస్పందనను గానీ రాయకుండా కొన్ని చుక్కలు పెట్టి వదిలేస్తారు. దానిని కథానుగుణంగా పాఠకుడే అన్వయించుకుంటాడు. అన్ని అర్థమయ్యేటట్లు అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు చెబితే కథకుడి ప్రతిభ తెలిసే అవకాశం ఉండదు. ఇలాంటి చోట్లనే శ్రీపాదవారి విశిష్టత తెలుస్తుంది. ఈ సూచకాలు కేవలం శ్రీపాద వారు మాత్రమే ఉపయోగించుకున్నారు. పైన చెప్పిన సూచకాలకు ఉదాహరణలు, సమన్వయం.........

మానసికావస్థ సూచకాలు:

ఉదా 1:

''అదేమిటే, బోడితలకీ బొటన వేలికీ''.....

''అదేమిటండీ దేవతలకు పంచాంగం''..........

.....................................................

.....................................................

''కాస్త నిదానించు, ఆకలి దొలుచుకుపోతోంది.''

(పేజీ నం:149, యామ్నొవం హోష్యామి, మూడవ సంపుటం)

ఇప్పుడు కథాగమనాన్ని బట్టి మొదటి ఖాళీలో తెల్లబోయాడనీ, రెండవదానిలో మాటలు రాక ఊరుకుండి పోయాడనీ, మూడవదానిలో ఏం మాట్లాడాలో ఆలోచించుకున్నాడనీ మనం వూహ చేయవచ్చును.

*__ఉదా 2:__*

''ఎక్కడో రాకాసి పీసుగు దొరికిందండీ ఆడబడుచు''

''అల్లుడికి బుద్ధి లేదు కనుక''

..................................................

''ఒక్కటి చెబుతా వింటావా? కోటీశ్వర శాస్త్రి ఇటు అమ్మాయి చేతిలోనే....................''

''పైగా, మెకి స్థాన బలం వుంది. మూడు మాసాల కంటే ఎక్కువ ఎరగదుట మొగుడి మొగం. పుట్టిల్లు విడిచిపెట్టినదేదీ?''

''కనుక అమ్మాయి క్కాపరం లేకపోతుందేమోనన్న బెంగవద్దు నీకు.''

''పోనీ అల్లుణ్ణి ఇల్లరికం............''

''అతనికిల్లరికమూ, అమ్మాయి కోడరికమూ అన్న భేదమేముంది?''

..............................................

''ఇంతకీ రాజమ్మ అతణ్ణి ఇక్కడికి రానిస్తుందా?''

............................................

‘‘పోనీ అమ్మాయినక్కడ వుండనిచ్చేట్టయినా వుందా?‘‘

ఇక్కడ కథాగమనాన్ని బట్టి జాగాల్లో విచారిస్తున్నట్టు, ఆలోచిస్తున్నట్టు, మూడవదానిలో నిజమేనని ఒప్పుకుంటున్నట్లు ముఖం పెట్టడం మొదలగు మానసికావస్థలు మన అనుభవంలోకి వస్తాయి.

ప్రతిస్పందనావస్థలు:

ఉదాహరణ 1:

‘‘ముందు నోరు మూసుకో, తరువాయి ఇంకేం వుందో అఘోరించు‘‘

....................................................

‘‘పనసకాయా?‘‘

.................................

‘‘నబగాయా?‘‘

...............................

‘‘ గుమ్మడి ఉందా?‘‘

...........................

‘‘పెండలమా?‘‘

‘‘దిక్కు మాలిన సంజ్ఞలు చాలించి, యీపాటికి నోరు తెరిచి చెప్పు.‘‘

ఇక్కడ మొదటి దానిలో ఏం కావాలో అడగండి అన్నట్లు, తరువాత వరుసాగ్గా లేదని చెప్పినట్లు, మరలా చివర దాంట్లో పువ్వు అని సంజ్ఞ చేస్తున్నట్లు బోధపడుతుంది.

(పేజీ నం:ఆ40, యామప్లోవం హోష్యామి, మూడవ సంపుటం)

ఉదా 2: ‘‘దానికి రైక కుట్టిపెట్టాలిట?‘‘

................................................

‘‘దొరగారు దయచేస్తారటనా?‘‘

.............................................

‘‘నేనిచ్చినప్పుడే ఇవ్వాలి కామోసు?‘‘

...................................

‘‘అయితే దాని క్కూడా చింపులాయినాయటనా?‘‘

.....................................

‘‘వులిక్కిపడి చూడనక్కరలేదు. అబ్బో నీ గుణం నాకు తెలియదనుకున్నావే?‘‘

ఇక్కడ పై రెండింటిలో అవును అని అన్నట్లు, మూడవ దానిలో ఏమో? అని, నాల్గవ దానిలో దీనికెలా తెలిసింది అని ఆశ్చర్యపోయినట్లు అన్వయించుకోవాలి.

(పేజీ నం: 276, 277, అరికాళ్ళకింద మంటలు)

**కాకు స్వరం:**

వాక్య పఠన పద్ధతిని లేదా వాక్యంలో ఉన్న పదాలను ఉచ్చరించే తీరును కాకువు అంటారు. కాకువుకు లేఖన చిహ్నం లేదు. ''కాకు: స్త్రియాం వికారో య: శోక భీతాన్ దిభి: ధ్వనే:'' అని కాకు స్వరాన్ని నిర్వచించారు. ఒకానొక అర్థాన్ని స్ఫురింపజేయడానికి పదం చివర ఉండే అచ్చును దీకరిస్తే అది కాకు స్వరం అవుతుంది. దీనివల్ల వచ్చే అర్థాన్ని వ్యంగార్థం అంటారు. ఒక్కోచోట కాకుస్వరాన్ని సూచించడానికి ఆశ్చర్యర్థకాలు, ప్రశ్నార్థకాలను కూడా ఉపయోగిస్తారు. దీనివల్ల వచ్చే వ్యంగార్ధాన్ని కాక్వాక్షిప్తం అంటారు. సంభాషణలలో కాకుస్వరం అనేది ప్రధాన పాత్ర వహిస్తుంది. అందుకే దీనిని శ్రీపాదవారు తన కథలలో బహుళంగా ఉపయోగించుకున్నారు. శ్రీపాద వారి వాక్య రచనా నిర్మాణంలో కాకుస్వరం ఒక ప్రత్యేకత. ఇక్కడ కాకుస్వరానికి ఉదాహరణగా వారి కథల్లో కొన్ని సన్నివేశాలు.

***ఉదాహరణ అ:***

''బిరడా తీశాడు అంతే, వెంటనే బిగించేశాడు.''

''కాని క్షణ మాత్రానికే అతని చుట్టూ ఉండిన జవానులు తుళ్ళిపడి మత్తెక్కుతున్నట్టయిపోయారు.''

''లోపల ఉండిన పెద్దమనుష్యులు, ఉలికిపడి యెగ ఊపిరి తీసుకుంటూ ఇటు చూశారు.''

''దివాను పక్కగానూ, కొంచెం వెనుకవాటుగానూ నుంచుని వుండి, అతని రాతలు ఓరకంట చూస్తున్న ఠాణేదారున్నూ చకితుడై వచ్చాడా? అన్నట్టొక మాటు గమ్మం కేసి చూసి , మళ్ళీ మొగం వంచుకున్నాడు. సాలోచనగా అప్పటికప్పుడే చర్రున మొగం పైకెత్తి ఏయ్! ఏమిటీ కంపు? అంటూ గద్దించాడు దివాంజీ, దగ్గుకుంటూ తీక్షణంగా చూస్తూనూ.''

( పేజీ నం: 15, గులాబీ అత్తరు, రెండవ సంపుటం)

**ఉదా 2:**

''ఇంకా రారేం? అన్నట్టు జానకమ్మ వొడ్డుకేసి చూసింది.''

''పంతులూ, వొక దొరసానీ మెల్లిగా వస్తూ పక్కని సిమెంటు బల్లకేసి మళ్ళారు. రామచంద్రం పది గజాలలో నుంచొని ఉన్నాడు.''

''ఎవరో దొరసానేవ్ అంది జానకమ్మ.''

''సుభద్ర వెనక్కి విరగబడి చూసి మరేనేవ్! ఎందుకు వచ్చిందో? అంటూ తెడ్డు డింగీ మీద ఉంచేసి జానకమ్మ కేసి చూసింది.''

(పేజీ నం: 7, అన్నంతపనీ జరిగింది కథ)

ఉదా 3:

''నిన్నటిదాకా యింగ్లీషు వాళ్ళు మనల్ని బానిసలుగా చేశారు. మరి యివాళ?''

''విధిలేక సాటి పౌరులుగా గుర్తిస్తున్నారండి.!

''భార్యాభర్తల మధ్య కూడా మన సంఘంలో అలాంటి చూపు కలగవద్దూ?''

''కలగాలండీ!''

''తక్కిన వారిని చూసి మీకర్థం అయిందా? అనడిగాడు శాస్త్రి.

(పేజీ నం: 21, కొత్తచూపు కథ)

*ముగింపు:*

శ్రీపాద వారి కథల్లో ముఖ్యంగా చెప్పుకోవలసింది ముగింపు. కథను ప్రారంభించడంలో కథకుడు ఎంత మెలకువ చూపిస్తాడో కథ ముగింపు దగ్గరకు వచ్చేసరికి కూడా అంతే జాగ్రత్త వహించాలి. ప్రత్యేక శ్రద్ధ పాటించాలి. పకడ్బందీగా ఉండాలి. ఎందుకంటే ఇక్కడే కథకు ప్రాణ ప్రతిష్ఠ జరుగుతుంది కనుక. ముగింపులో ఎంత బిగింపు ఉంటే కథ అంత హత్తుకుంటుంది. కథ చదవటం పూర్తి అయ్యాక పాఠకుడు కాసేపు తనకు తెలీకుండానే అందులో చిక్కుకుపోవాలి. కథను మూసేసినా ప్రభావంలోనే ఈదులాడాలి. ఇటువంటి విద్యలో శ్రీపాద వారు అందెవేసిన చెయ్యి అనిపిస్తుంది. ఆయన కథల్లో కొసమెరుపు ఎలా తళుక్కుమంటుందో ఓసారి చూద్దాం.

లీగల్ ఎడ్వయిజ్ అనే కథను తీసుకుందాం.

రాజు తరువాత రాజంతటి వాడు దివాన్. రాజు పేరుకే గాని మంత్రాంగాలు, యంత్రాంగాలూ అన్నీ దివాంజీ చూసుకోవలసిందే దివాన్ని దివాంజీ అని పిలిచేవారు ఆ రోజుల్లో. దివాన్ కింద మరో కీలకమైన ఉద్యోగి ఉంటాడు. దివాన్‌కి ఎప్పుడు ఎసరు పెడదామా అనే అదను చూసేవారే చాలా మంది ఉంటుంటారు. ఇలాంటి ఇతి వృత్తంతో సాగిన కథే ఇది.

రాయణింగారి స్థానంలో దివాన్లు చాలా మంది మారుతూ వచ్చారు. అందరూ ఘటికులే. దివాను క్రింది ఉద్యోగులు అవసరాన్ని బట్టి అడుగులకు మడుగులలొత్తుతూ నటించేవాళ్ళు కొందరు అయితే ...... అసూయతో కళ్ళలల్లో నిప్పులు పోసికొని ఏకంగా దివాన్ గిరికే అంతం పాడిన వారు కొందరున్నారు. ఈ పరంపరలో కామన్న అనే దివాన్ రాయణింగారికి నమ్మిన బంటులా ఉండేవాడు. ధైర్యం కలవాడే కాదు ఎంతటి వాడికైనా చురక అటించటంలో దిట్ట.

ఓసారి రాయణింగారు........... ఉద్యోగుల మాటలు విని కామన్న కార్యాలయానికి వస్తారు. చాడీలు చెప్పేవాళ్ళ గురించి దివాన్ దగ్గర ప్రస్తావించాలని రాజుగారి ఉద్దేశం.

''కామన్నా!''...............

''ఏమి సెలవు మహాప్రభూ!''...........

''కాసికలు చెప్పేవాళ్ళను ఏమి చేయాలోయ్?...........రాయణింగారు దివాన్‌జీని ప్రశ్నిస్తారు. దివాన్‌జీ సమాదానం ఎలా ఉందో చూడండి. అదే ఇక్కడ ముక్తాయింపు. రాయణింగారు చెప్పుడు మాటలు వింటున్నారని కామన్నకి ఎప్పుడో తెలుసు. ఎక్కడా దొరకకుండా ఎవరికి తగలాలో వారికే తగిలేలా కామన్న చెప్పిన జవాబులో ఎంత చాకచక్యం ఉందో మనం ఇక్కడ గ్రహించాలి. కామన్న చెప్పిన సమాధానం ఇది.

''ఆ! ఏముంది బాబూ! వినేవాడి చెవులు తెగ్గోస్తే సరి''..............

''దీనితో అక్కడి క్రింది ఉద్యోగి అప్పలనరసయ్యతుళ్ళిపడి చూశాడు.''

''ఇక రాయణింగారు, బిగపట్టుకొన్న ఊపిరి విడిచి బుర్ర వంచుకుని వచ్చిన దారినే చక్కాపోవటం తప్ప మరేమీ చెయ్యలేకపోయారు.''

ఇక్కడున్న ముగింపులో బిగింపు........ ఎంత చురుక్కుమని తగిలిందో మనకూ అనుభవంలోకి వస్తుంది. ఇక్కడ సమయస్ఫూర్తి ఒక్కటే కాదు, మందలింపు కూడా కనిపిస్తుంది.

ఇలాంటిదే మరోటి జోడు అన్న కథ. ఈ కథను ఇంతకు ముందే చెప్పుకున్నాం. కాబట్టి ఇక్కడ కేవలం ముగింపును మాత్రమే ప్రస్తావిస్తాను.

''ఈ స్థితిలో రాయణింగారు బక్క మనిషి చేయి ఒడిసి పట్టుకుని నువ్వే కదూ బుట్ట వొంచేసుకున్నావూ?............అని జోడు తేవోయ్ అని ఆజ్ఞ జారీ చేసి కలకలం సృష్టించారు.''

''ఇది చెవిన పడిందో లేదో బక్క మనిషి తోటకూర కాడలా వాడిపోయాడు''.

''చెప్పుల జోడా......... సంకెళ్ళ జోడా..........అక్కడున్న వాళ్ళల్లో కంగారు పట్టుకుంది.

''బాబుగారి కాళ్ళమీద పడిపోరా....వెనకనుంచి అన్నారెవరో......... కడుపాత్రం కొద్దీ తిన్నాడు బాబయ్యా.........పిల్లలు కలవాడు.............రక్షించండి అంటూ ఒక బ్రాహ్మణుడు ముందుకొచ్చాడు. బతిమాలుకోరా.........నోరు విప్పవేమిరా..........అంటూ మరో బ్రాహ్మణుడు రుంజుకున్నాడు.''

''ఎవరెన్ని అంటున్నా...... బక్క మనిషి ఎలా వణికిపోతున్నా.......రాయణింగారి ముఖ కవళికల్లో మాత్రం విధించబోయే శిక్ష తాలూకు రూపం ఎలా ఉంటుందో లేశమైనా అవగతం కావటం లేదు.''

''గుమాస్తా జోడు తెచ్చాడు.''

''రాయణింగారు కుడి చేయి చూపారు. ''

''జేబులోంచి గుమాస్తా జోడు తీసాడు.''

''అందరి కళ్ళూ జిగేల్మన్నాయ్.''

''చూడగా అది రత్నాలు తాపిన మురుగుల జోడు. చూసేవాళ్ళకి గుండె ఓ నిమిషం ఆగి మళ్ళీ కొట్టుకుంటుందేమో అన్నంత కొసమెరుపు. ''

కథ ఇంతటితో అయిపోయింది.

దీని తరువాత మరో వాక్యం ఏది రాసినా ఇంత పట్టు ఉండదు. ఏ వాక్యం రాసి ముగిస్తే పాఠకుణ్ణి నిలబెట్టేయ వచ్చో సరిగ్గా అదే రాసి కలం మూసేసారు శాస్త్రి గారు. పాఠకునికి మధ్యలో ఎక్కడా దొరక్కుండా.......చివర్ల తనే ముడి విప్పటంతో కథకుని గెలుపు ఉండాలో శాస్త్రి గారు చెప్పకనే చెప్పినట్లయింది.

ఇలాగే ఈ కోణంలో ముగింపు బిగింపు చూపించిన ప్రత్యేక కథలు ఇంకా ఉన్నాయి. పాఠకుడు పట్టుకోకుండా ముగింపు ఇవ్వడంలో కథకునికి ఎంతో నేర్పు ఉండాలి. ఇవన్నీ శ్రీపాద వారిలో పుష్కలంగా నూటికి నూరుపాళ్ళు ఉన్నాయి.

***<u>శ్రీపాద వారిపై కొన్ని అభిప్రాయాలు:</u>***

**<u>ఆ. రేఖాచిత్రాలకు ఆద్యుడు:</u>**

శ్రీ శాస్త్రిగారి చిన్నకథలలో ఒక వాక్యం, ఒక్క పేరాగ్రాఫు పనిని నిర్వర్తిస్తూ ఉంటుంది. ఒక్కొక్క వాక్యం ఒక్కొక్క పేరా వలె వ్రాయబడి ఉంటుంది. అమెరికా రయచిత విలియం సారోయన్ ఈ సంవిధానాన్ని అనుసరిస్తాడు. పాశ్చాత్య సంసర్గం లేని శ్రీ శాస్త్రిగారికి ఇదేమీ తెలియదు. వారి ప్రతిభ విశ్వ రచయితల తరంగధైర్యంలోనిది కనుక, ఇట్టి టెక్నిక్ ఆయనకు తట్టింది. ''అల్పాక్షరముల అనల్పార్థ రచన'' అని ప్రాచీనుడైన పాల్కురికి సోమన చెప్పినాడు. ఈ సూత్రానికి శాస్త్రిగారి చిన్న కథలు నిదర్శనాలు. గురజాడ ఆణిముత్యాలు అనే అయిదు కథలు తప్పించి శ్రీ శాస్త్రిగారి చిన్న కథలను మించిన కథలు లేవు. రేఖా చిత్రాలు అని మనం నేడు వేటినంటామో, ఆ ప్రక్రియా రచనలకు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రే ఆద్యుడు. ఒక పదం చేత, రెండు వాక్యాల చేత ఒక మహత్తర మూర్తినీ, రోమాంచకారి సన్నివేశాన్నీ కండ్లకు కట్టినట్లు చిత్రించే సమాస శక్తి శ్రీ శాస్త్రి గారిది.

- సర్దేశాయి తిరుమలరావు

(ఆంధ్రప్రభ వార పత్రిక - ఉత్తరాల శీర్షిక: 25.5.77)

(నేటికీ శ్రీపాద - విశాఖ ఆకాశవాణి ప్రసారమాలిక, 2007)

2. కథలు రాసేవారు చాలా మందే ఉంటారు. కథలు చెప్పగలిగిన వారు మాత్రం అరుదుగా ఉంటారు. కథ చదివేటప్పుడు కథ చదువుతున్నట్లు కాక వింటున్నట్లు అనిపించేలా వ్రాయగల వారు మరీ అరుదుగా ఉంటారు. అటువంటి ప్రతిభాశాలి శ్రీపాద.

ఒక్క మాటలో చెప్పాలంటే...

చాలా రచనలు కళ్ళతో చదువుతాం....

చాలా మాటలు చెవులతో వింటాం....

శ్రీపాద వారి రచనలు కళ్ళతో వింటాం.

- డాక్టర్ చాగంటి శరత్ బాబు

(నేటికీ శ్రీపాద, ఆకాశవాణి ప్రసార మాలిక, 2007)

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి భాషా నేపథ్యం - దృక్పథం

## - ఆలమూరు మనోజ్ఞ

(4)

*తెలుగుదనం - మాండలికం*

**మొదట శ్రీపాదవారు పద్యకవిగా** సాహితీరంగంలో ప్రవేశించి అవధానాలు చేసినప్పటికీ... తరువాత గద్యంపై కూడా బలమైన పట్టు సాధించి మహా రచయిత అనిపించుకున్నారు. తెలుగు వ్యావహారిక భాష పలుకుబడిలోని సొగసు, మాధుర్యం, శక్తి తెలియాలంటే తప్పకుండా వీరి రచనలు చదివి తీరవలసిందే అందుకే మల్లాది రామకృష్ణ శాస్త్రి గారు వీరి గురించి ఇలా అన్నారు. జాను తెనుగు నేర్చినవారికే శాస్త్రిగారి రచనలు చదివి ఆనందించే అదృష్టం. మరొక భాషలో అనువాదానికి లొంగని శైలి ఆయనది.

శ్రీపాద వారి రచనలు చదివితే వెనుకటి తరంలో గోదావరి జిల్లాల్లోని బ్రాహ్మణ కుటుంబ ఆచారాలు, సంప్రదాయాలు, వారి వెనుకబడిన భావాలు, స్పర్థలు, ఆప్యాయతలు ఇవన్నీ రమణీయంగా కలబోసి దర్శనమిస్తాయి. మల్లాది వారన్నట్టు బ్రాహ్మణీకమే ఆయన రచన అనేది వాస్తవమయినప్పటికీ విస్తృత నేపథ్యంలోంచి అవలోకించగలిగితే అందరికీ, అన్ని కాలాలకీ వర్తించే చేదు నిజాలు, గుర్తుంచుకోదగ్గ సందేశాలు శ్రీపాద వారి రచనల్లో కనిపిస్తాయి. ఈనాటికీ అవి పాతబడిన రచనలుగా అనిపించవు.

ఆ9వ శతాబ్దం తరానికి చెందిన కథకుల్లో మల్లాది రామకృష్ణ శాస్త్రిగారు, శ్రీపాద వారూ ఒక విలక్షణమైన కథన రీతిని మలుచుకున్నారు. వీరిలో ఒకరు కృష్ణా తీరం, మరొకరు గోదావరి తీరానికి చెందినవారు కావడం ఆసక్తికరం. ఇద్దరి రచనల్లో స్వచ్ఛమైన తెలుగు పరమళిస్తూ ఉంటుంది.

తెలుగుదనం సంస్కృతికి సంబంధించినది. భాషకి సంబందించినంత వరకూ రాసేది తెలుగే అయినా మాండలికమైన భేదాలు ఉంటాయి. మాండలికంలో రచించడం అప్పుడూ, ఇప్పుడూ కూడా ఉన్నదే తెలుగు నుడికారం అని మనం మామూలుగా అనుకుంటున్నది నిజానికి మాండలికాలకు చెందినది. స్పష్టమైన స్థానీయత, మాండలికమైన నుడికారం స్థూలంగా తెలుగుదనంలో భాగాలే. శ్రీపాద కథల్లో విలక్షణత గాఢమైన స్థానీయత, వారు వాడిన మాండలికం. ఇది చాలా శాతం రామకృష్ణ శాస్త్రి గారికి కూడా వర్తిస్తుంది.

శ్రీపాద వారి కథలు బహుశా ఆయన రచించిన కాల కంటే తరువాతనే బహుళ ప్రాచుర్యాన్ని , ప్రశంసనీ పొంది ఉంటాయి. ఈనాటికీ తెలుగు కథ అంటే ముందుగా వీరి పేరు చెప్పుకోవలసిందే

శ్రీపాద వారి కథనం విలక్షణమైనది. చిన్న కథల పేరుతో రాసినా నిజానికవి పెద్ద కథలే. ఆయన కథనంలో ఉండే రుచి అంతా గోదావరి మాండలికం వల్లనూ, శిల్పం వల్లనూ ఏర్పడినదే శాస్త్రిగారు వాడిన మాండలికం గోదావరి జిల్లా వైదిక బ్రహ్మణ కుటుంబాల్లో మాట్లాడిన భాష. వాస్తవానికి శాస్త్రిగారి పలుకుబడులకి గోదావరి ప్రాంతీయులు కూడా ఇప్పుడర్థం చెప్పలేరేమో. 'అనాచారప్పినుగ', 'ఎనిమిదో అట్టం ప్రారంభించడం', 'అగ్నిహోత్రాల వేళ', 'వోఘాయిత్యం', 'దంపశుద్ధి అయిపోవడం', 'వపనం చేయడం' ఇట్లా అనేక పదాలు ఈనాడు చాలా మంది ఎరుగని మూర్ధన్యాలు అనేకం ఉన్నాయి వారి రచనల్లో.

శాస్త్రి గారు తమ కథా వస్తువుల్నీ, పాత్రల్నీ, వారి పలుకుబడినీ జనంలోంచే తీసుకున్నారు. తమ చుట్టుపక్కల పరిసరాల్నీ, లోకం తీరుతెన్నుల్నీ సునిశితంగా పరిశీలించారు. హృదయాన్నీ, బుద్ధినీ సమన్వయం చేసి రచనల్ని కళాత్మకంగా తీర్చిదిద్దారు.

శాస్త్రిగారి కథా పరిసరాలు పరిమితమైనవే కావచ్చు, కానీ సంపూర్ణంగా ఆయనకు పరిచితమైనవి. ఆయన భాష తెలుగు దేశంలో ఒక ప్రాంతంలో, ఒక వర్గంలో వాడుకలో ఉన్నదే కావచ్చు, కాని దాంట్లో ఎంత చైతన్యముందో తమ కథల ద్వారా నిరూపించారు. తమకు బాగా నలిగిన భాషలో రాసినంత మాత్రాన ఇతర ప్రాంతాల, ఇతర వ ర్గాల పలుకుబళ్ళు యనకు నచ్చలేదని అనుకోవడానికి వీలులేదు. ఐదు ప్రాంతాల పలుకుబళ్ళు తెలుగు భాషకు ఐదు ప్రాణాలని తమ అనుభవాలూ- జ్ఞాపకాలునూలో ఆయన చెప్పుకున్నారు. తన రచనలు గురించి ఇలా కూడా చెప్పుకున్నారు.

'వైదిక విద్యలను విడిచి కొత్తదారి తొక్కాను. మేరలేని ఆత్మానందమూ అనుభవించగలుగుతున్నాను. ఎంచేతా? అంటే తెలుగుభాషలో ఒక రచయిత కాగలిగినందుకు , తెలుగు భాషలో- మధురాతి మధురమైన తెనుగు భాషలో...... నా జాతి వాళ్ళు చిన్న చూపే చూస్తూ ఉండినా, మాధుర్యం గుర్తించి శక్తిన్నీ, అవగాహన చేసుకుని పాశ్చాత్యులు కూడా ముక్త కంఠంతో కీర్తించిన నా మాతృభాషలో కలంపట్టి నాలుగు బంతులు రాసే అదృష్టం పట్టినందుకున్నూ.......జనులకు స్వవిషయం విడమర్చి చెప్పడం- ఆత్మగౌరవం అలవర్చడం- సహనం కలిగించడం- సరికొత్త భావాలు మప్పడం- కొత్త ఆశలు రేకెత్తించడం - గతంలో ఉండుకున్న సత్యం - ఆవిష్కరించడం, భవిష్యత్తుకు కొత్తదారులు కల్పించడం - తన్మూలంగా దేశీయులందరికీ స్వయం నిర్ణయశక్తి కలిగించడం ఇదీ నా పూనిక'.

'అది నిర్విఘ్నంగానూ, నిఘాటంగానూ, నిరాకంటంగానూ సాగడం నా లక్ష్యం. జాతికి, ప్రతిపదికలకు భంగం లేని గమ్యం కనబరచడం నా ప్రాప్యం'.

*మాండలికం:-*

శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి రచనా వ్యక్తిత్వం రూపుదిద్దుకున్న కుటుంబ వాతావరణమూ, ప్రాంతమూ, కాలమూ సంశ్లిష్టమైనవి. ఆయన కుటుంబ వాతావరణం వైదిక పండిత సంప్రదాయానికీ, విశ్వాసాలకూ సంబంధించినది. పుట్టి పెరిగిన ప్రాంతం, చాలా వరకు కుల విద్యలకూ, కావ్య పాఠాలకూ, సంస్కృత సంస్కృతికీ నిలయమైన గోదావరీ పరీవాహక ప్రాంతం.

నేటి ఆంధ్రప్రదేశ్ లోని తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కల భూభాగం మధ్య మండలంగా పేర్గాంచినది. ఇక్కడి భాషకు మధ్యాంధ్ర మాండలికం అని పేరు. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లో సుభిక్ష ప్రాంతమై సస్య శోభితమై సిరిసంపదలతో వెలుగొందుతున్న కారణంగా ఈ మాండలిక భాష ప్రామాణికాంధ్రమై మన్నన పొందుతూంది. ఈ మాండలిక భాషపై సంస్కృత ప్రభావం అధికంగా ఉంది. ఇతర మాండలిక భాషా వ్యవహర్తల కంటే ఇక్కడ ఉన్న సామాన్యాంధ్ర

భాషా వ్యవహర్తల వ్యవహారంలో సంస్కృత పదాల ప్రాచుర్యం అధికం. అలాగే తెలుగు క్రియా రూపాలలో మిగిలిన మాండలిక క్రియా రూపాలకంటే విలక్షణ రీతిలో పరిణత రూపాలు ఈ మండలంలో కనిపిస్తాయి.

| మధ్యమండలం | క్రియ | |
|---|---|---|
| ఇచ్చేడు | ఇచ్చినాడు | |
| కొట్టేడు | కొట్టినాడు | |
| చేసేడు | చేసినాడు | మొదలగునవి. |

ఇక్కడ 'ఇచ్చేడు', 'కొచ్చేడు', 'చేసేడు'..........అన్న వాటిలో ' ఏ' ఒక నూతన ధ్వని. అలాగే మధ్య మండలం వారి వైదికోచ్చారణలో జ్మధ్యస్థ 'ట' కారం 'ష' కారంగా వినబడుతుంది.

ఉదా... అటు........అషు
ఇటు.........ఇషు
ఎటు..........ఎషు
అట...........అష ఇలా.

శ్రీపాద వారి కథలలో ఇటు వంటి ఉచ్చారణ ఏ విధంగా ఉందో గమనిద్దాం. అరికాళ్ళకింద మంటలు కథలో సంభాషణ ఈ క్రింది విధంగా ఉంటుంది.

'................నేనింకా వండి వడ్డించగలననే అనుకున్నావుషోయ్ ?'
'ఆ సంగతి నాకేం తెలుసండీ?''
'..................................................'
'..................................................'
' ..............................................'
'మీ అమ్మాయి ఏం చేస్తోందీ?'
' అది వూరికే కూచుంఛోందనా నీ వూహ?'
'..................................................'
'శాస్త్రం చెప్పిన తరువాయిగా వుంది నీ మాట. కాటికి కాళ్ళు చాచుక్కూచున్న దానికి నాకు వైద్యాలేమిషోయ్ యిప్పుడూ?'
' ..................................................'
' ..............................................'
'చెప్పాను కదూ? అవి తెమల్చుకోవడం మాత్రం మాటలా?'
'కాకపోయినా, తల చెడ్డవాళ్ళిద్దరింట్లో వుండగా పునిస్త్రీ పడుచు మడికట్టుకోవడం యేమిషోయ్ ?'
'..................................................'

'లోకంలో ఎక్కడైనా వుందిషోయ్ ? యి సబబూ?'

'..................................................'

' అయితే నా మాట?'

' అంటే?'

'నీకింత తెలియకుండా వుందేమిషోయ్ ? అది చేసిన వంట నన్ను తినమంఛావా యేమిషోయ్ ? అయ్యో నా గ్రహచారమా?'

'.....................................'

(అరికాళ్ళకింద మంటలు, శ్రీపాద కథలు-మొదటి సంపుటం)

శ్రీపాద వారు తెలుగును ఎంత అందంగా వాడుకున్నారో సంస్కృత భాషను అంతే అందంగా సందర్భానికి తగ్గట్టుగా వాడుకోవడం జరిగింది. వడ్లగింజలు మొదలగు కథలను పరిశీలిస్తే మనకి ఇది అవగతమౌతుంది. అలాగే ఆయన తన కథలలో కొన్నింటికి ఏకంగా సంస్కృతంలోనే పేర్లను పెట్టడం కూడా జరిగింది. 'శుభికే శిర రోహ', 'కన్యాకాలే యత్నా ద్వరితా' మొదలగునవి దీనికి ఉదాహరణలు. అలాగే శ్రీపాద వారు వాడిన సంస్కృత పదాలను కొన్నింటిని మీ ముందు ఉంచుతాను.

'చిత్తం చిత్తం, ఒక విద్యలో నేను చక్రవర్తిని. విద్దత్తున్నచోట వేషం అక్కర్లేదండీ.'

'దీంతో శంకరప్పలో ధైర్యం అంకురించింది'.

అలాగే 'ప్రాజ్ఞత', 'మర్మాఘాతం', 'శైశవ మౌగ్ధ్యం', 'భృత్యుడు', 'వర్చస్సు' ఇలా అనేక పదాలను శ్రీపాద వారు తన కథలలో వాడుకోవడం జరిగింది.

*శ్రీపాద వారి కథలలో పండిత సంప్రదాయం వుండవచ్చు. దృక్పథంలో పరిమితులుండవచ్చు. వైరుధ్యాలుండవచ్చు. కాని విశ్లేషించుకుంటే స్ఫూర్తి పొందగలిగే భాషా సంస్కారమూ, సాహిత్య సంస్కారమూ వాటిల్లో చాలా ఉంది. భిన్న భాషా శైలుల నిర్మాణ సామర్థ్యమూ, పలుకుబళ్ళలోని పదునూ, సారళ్యమూ, వీరి భాషా సంస్కారంలోని అంశాలు. చిత్తశుద్ధీ, కథన కౌశలమూ, సునిశితమైన లోక వృత్త పరిశీలనమూ, తెలుగు జాతీయతా యన సాహిత్య సంస్కారంలోని అంశాలు. అందుకే ఈయన గురజాడ తరువాత జాతి కథకుడు.*

*--ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి.*

ఇది అక్షరాలా నిజం. దీనిని ప్రతీ ఒక్కరూ ఒప్పుకొని తీరవలసిందే అందుకే వీరిని మనం గోదావరి గానే సంభావించుకోవాలి. తెలుగు భాష ఉన్నంత వరకూ శ్రీపాద వారి కథలు వర్ధిల్లుతూనే ఉంటాయి.

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి భాషా నేపథ్యం - దృక్పథం

## - ఆలమూరు మనోజ్ఞ

(5)

### సామెతలు - ఉద్ధరణలు

### (శ్లోక,పద్య, మంత్రాలు)

**సామెతలు:-**

సామెత సమత అనే పదం నుంచి వచ్చిందని సి.పి.బ్రౌన్ చెప్పారు. సామెతలో పోలిక బాగా కనిపిస్తుంది. అంటే ఒక విషయానికీ, మరొక విషయానికీ ఉన్న కొన్ని సమాన చిహ్నాలను చూసి, పోల్చి చెప్పడం సామెతలో కనిపిస్తుంది. అందువల్ల సామెత అనే పదం సమత అనే పదం నుంచి ఏర్పడి ఉంటుందని భావించవచ్చును. సమత - సామ్యత - సామెత అనే విధంగా ఈ పదం రూపాంతరం చెందినట్లుగా పరిశోధకులు భావిస్తున్నారు. ఆంధ్ర దేశంలో సామెతను చాటువ, సాటువ, శాస్త్రము మొదలగు పేర్లతో పిలుస్తున్నారు. అల్పాక్షరాలలో అనల్పార్థ రచన అనే దానికి సామెత బలమైన ఉదాహరణ.

శ్రీపాదవారు వారి కథల్లో సామెతలను ఎక్కువగానే వాడారని చెప్పవచ్చును. ముందే చెప్పుకున్నట్లు వీరి కథలన్నీ సంభాషణ రూపంలో ఉంటాయి. వీరి కథల్లో సంభాషణ సహజత కోసం వీరు చాలా చోట్ల సామెతలను వాడుకోవడం గమనిస్తాం. మామూలుగా మనం నిత్యం మాట్లాడుకునే మాటల్లో సామెతలను ఎలా చొప్పిస్తామో శ్రీపాద తన కథల సంభాషణల్లో అలాగే వీటిని వాడుకున్నారు.

ఒక కథలో ఒక సంభాషణలో సామెతలు వాడడం వల్ల సంభాషణకు మరింత సహజత అబ్బి అందాన్ని చేకూరుస్తుంది అనడంలో సందేహం లేదు. అయితే సామెతలను ఎక్కడపడితే అక్కడ ఉపయోగిస్తే వాటికున్న అందం చెడుతుంది, ప్రయోజనం శూన్యం అవుతుంది. సమయానికి, సందర్భానికి తగ్గట్టుగా వాడితేనే వాటికి విలువ ఉంటుంది. శ్రీపాద వారు దీనిని బాగా ఆచరించినట్లు కనిపిస్తుంది. వీరు సుమారుగా కొన్ని పదుల సామెతలను వాడారు. శ్రీపాద భాషను స్త్రీల దగ్గర నుంచి నేర్చుకున్నారని చెప్పుకున్నారు. సామెతలను స్త్రీలు వాడినంతగా ఎక్కువగా మరెవరూ వాడరు. అందుకే వీరి రచనల్లో సామెతలు ఎక్కువగా

చోటుచేసుకున్నట్లు కనిపిస్తాయి. సమయానికీ, సందర్భానికీ తగ్గ సామెతలు వాడడంలో శ్రీపాద సిద్ధహస్తులు. శ్రీపాద వారి కథలను చదివితే సామెతల్లో వీరికున్న ప్రజ్ఞ మనకు అవగతమౌతుంది.

'యావజ్జీవం హోష్యామి' అన్న కథలో ఒక్క పేరాగ్రాఫు లోనే శ్రీపాద వారు 4 లేక 5 సామెతలు దాకా వాడారు. అందువల్ల అక్కడ సంభాషణ ఎంత సహజంగా ఉందో చూడండి.

" ........................................... "

"ఇదిగో ఓయ్,............నల్లరాయి!..............ఏమండోయ్, మిమ్మల్నే ....వెళ్ళమని చెప్పడానికయినా నోరు విడదూ?"

" ..................................... "

" నా మాట కొట్టేసి, నాకు బదులు చెప్పకుండా మీరెలా నిద్రపోతారో చూస్తాను కదూ?................ 'మొండివాడు రాజుకంటే బలవంతుడట'. 'చెవిటి వాడి ముందు శంఖం వూదితే అది కొరకడం నీ తరమూ? నా అబ్బ తరమా?' అన్నాడట. 'వెర్రి వాడికి పెళ్ళాం దొరికితే గిల్లి చంపాడుట'. ' ప్రజ్ఞకు పెళ్ళాడాను గాని కూడు పెట్టడం మా కులంలో లేదన్నాడుట'. మా నాన్న వద్దు మొర్రో అంటూనే ఉన్నాడు. మా అమ్మ వెలగబెట్టిందీ సంబంధం. అనుక్షణమూ దాని జీవానికి పడి యేడుస్తూనే ఉన్నాను. పెళ్ళామనీ, బిడ్డనీ............."

"ఇంత కొయ్యతనం ఎక్కడా చూడలేదు. ఎన్ని మాటలన్నా 'దున్నపోతు మీద వాన కురిసినట్టే."

"వోసినీ ఇల్లు...."

"మీ ఇల్లే , మీ బతుకే, అదేదో మీకే."

(యావజ్జీవం హోష్యామి, మూడవ సంపుటం, 154, ఆ55)

అలాగే శ్రీపాదవారు తొందర తగదనీ, తగ్గమనీ చెప్పడానికి 'గుర్రం దిగండి' అనే మాటను ఎక్కువగా వాడతారు.

"లొంగక? ఆడదామనుకుంటున్నారు కామోసు ఆట జుట్టు చేతికిచ్చి...హి! "

"చాలించేపాటికి. కసిన్ని మంచినీళ్ళు పట్టుకురా ముందు".

"గుర్రం దిగండీపాటికి. అప్పలమ్మని రానివ్వండి ముందు."

(పేజీ నం: 157, యావజ్జీవం హోష్యామి, మూడవ సంపుటం. )

ఇంకా "కన్యా కాలే యత్నా ద్వరితా" అనే కథలో కూడా.

"గంధ పరిమళానికి వీధి పొడుగునా అందరూ విరగబడి చూడ్డమే. సిగ్గేసింది నాకు."

"పా - పం"

"తెచ్చినందుకా"

"చూశారా? ఇవాళ యిలా మొదలు పెట్టారేమిటీ అన్నయ్యగారూ? నీ బెల్లింపుల కేంగానీ.... మరి చూస్తూ నుంచుంటే కాదు తల కూడా నేనే దువ్వాలిట."

"అయితే గుర్రం దిగండి"

"ఏం...."

"వారు ఇంట్లో లేరు మరి".

ఈ విధంగా శ్రీపాదవారు తన కథలలో సామెతలను, జాతీయాలను చొప్పించి వారి కథలకు మరింత అందం తీసుకువచ్చారు.

ఉద్ధరణలు:-

ఇక్కడ ఉద్ధరణలు అంటే పద్యాలు, శ్లోకాలు, మంత్రాలు మొదలగునవి. శ్రీపాదవారు జన్మతః వైదిక సంప్రదాయానికి చెందిన వారు. వారి కుటుంబంలో అందరూ శుద్ధ శ్రోత్రీయులే. వీరి కుటుంబంలో అందరూ వేదాలు, సంస్కృతం మొదలగు వాటిల్లో పండితులు. జ్యోతిశ్శాస్త్రం వీ రి ప్రధాన ఆయుధం. శ్రీపాదవారు కూడా చిన్నప్పుడు సంస్కృతం బాగా చదువుకున్నారు. వీరికి జ్యోతిశ్శాస్త్రంలో కూడా మంచి పట్టు ఉంది.

శ్రీపాదవారు తన కథల్లో సామెతల వలె ఉద్ధరణలను కూడా సందర్భో చితంగా వాడుకున్నారు. వీరికి తెలుగుతో పాటు సంస్కృతం అంటే కూడా చాలా ఇష్టం. జాతీయత రావాలంటే సంస్కృతాన్ని జాతీయ భాషగా రూపొందించాలని శ్రీపాద వారి అభిప్రాయంగా ఉండేదా రోజుల్లో.

శ్రీపాదవారు తన కథల్లో ఈ ఉద్ధరణలు ఏ విధంగా ఎక్కెడెక్కడ వాడారో పరిశీలిద్దాం. వీరి 'వడ్లగింజలు' కథలో అయితే మొట్టమొదట కథను మొదలు పెట్టడమే శ్లోకంతో మొదలుపెడతారు.

"రాజద్వారే, రాజగృహే సర్వదా ద్విగిజయోస్తు. వేదోక్తం పరిపూర్ణమా"....... అంటూ ఆశీర్వదిస్తూ కథలో ప్రముఖ పాత్ర అయిన శంకరప్ప తన సంభాషణను మొదలు పెడతాడు.

అలాగే 'శుభికే శిరః రోహ' అన్న కథలో చివరలో అన్నపూర్ణ....రొమేష్‌కి, హిందీ యువతికీ హారతి ఇచ్చేటప్పుడు ''శుభికే శిరః రోహ శిభయంతీ ముఖం మమా''. .....ఇత్యాదిగా మంగళహారతి సామయిక మంత్రం పఠింపజేస్తారు.

ఇంకా 'అనుకున్నంత పనీ జరిగింది' అన్న కథలో పంతులయ్య తన కూతురు ప్రజ్ఞను తలుచుకుంటూన్నప్పుడు అతనిచేత శ్రీపాదవారు ఇలా అనిపిస్తారు.

"శబ్దేందు శేఖరః పుత్రో మంజూషా మమ పుత్రికా".

ఇంకా శ్రీపాద అనుభవాలు-జ్ఞాపకాలునూ అన్న స్వీయచరిత్రలో అయితే ఇవి అంతులేకుండా దర్శనమిస్తాయి. శ్రీపాదవారు రామకృష్ణకవుల దగ్గరకు చదువుకోవడానికి వెళదామనుకుని ....అనుమతి కోసం ఉత్తరం రాస్తూ దాని కవరు మీద అడ్రస్సు ఇలా రాశారుట. ఇంకా అందులో ఉత్తరం అంతా కూడా పద్యాలుతోనే రాశారుట. కవరు మీద అడ్రస్సులో కేవలం నాలుగో పాదమును మాత్రమే ఆయన తన పుస్తకంలో చెప్పుకున్నారు. వారికదే గుర్తుండడం వల్ల.

"వేంకట రామకృష్ణ కవి వీరవవరేణ్యులకున్, పిఠాపురం" అని.

(పేజీ నం: 252, అనుభవాలూ-జ్ఞాపకాలునూ)

శ్రీపాదవారికి అష్టావధానంలో కూడా ప్రవేశం ఉంది. వారికి ఆశువుగా పద్యాలు చెప్పడం కూడా వచ్చును. ఒకసారి శ్రీపాద, వారి గురువుగారు రామకృష్ణ శాస్త్రిగారు కూర్చున్నప్పుడు పాము కనిపించింది. అప్పుడు గురువుగారు.... శ్రీపాద వారిని పాము మీద ఆశువుగా పద్యం చెప్పమని అడిగారుట. అప్పుడు వారున్నూ ఆశువుగా అప్పటికప్పుడు పద్యం చెప్పారుట. అది ఇలా ఉంది.

''కనులబడి యిట్టె యెగిరిపోయినది పాము
మింట గికురించి పోయెడి మెరుపువోలె
పాము జూచుట తథ్యము, భ్రాంతి వొడమె
రజ్జువాయని తుద కహో రయము పెంపు.''

(పేజీ నం: 268, అనుభవాలూ-జ్ఞాపకాలునూ)

అలాగే సంస్కృతం శ్లోకాలను కూడా తన రచనల్లో అక్కడక్కడా వాడుకోవడం కద్దు. అటువంటిదే ఇక్కడ ఒకటి. కవిత్వం గురించి చెబుతూ....

"భోజనం దేహి రాజేంద్ర! ఘృతసూపసమన్వితమ్
మాహిషం చ శరచ్చంద్ర చంద్రికా ధవళం దధి."

"అన్న శ్లోకం పూర్వార్థం అయితే చాలదు, ఉత్తరార్ధంలో ఉన్న గాంభీర్యమూ అవగాహన చేసుకోగలగాలి, సాహితీవేత్త అయినవాడు అని చెప్పారు".

(పేజీ నం: 265, అనుభవాలూ-జ్ఞాపకాలునూ)

అలాగే 'విపులా చ పృథ్వీ', 'అగ్ని ముఖం వైదేవాః', 'మంత్రి ముఖం వైరాజనః', 'మాఘే మేఘే గతః వయః' వంటి ఆర్యోక్తులను కూడా వీరు తన రచనలలో వాడుకున్నారు.

ఈ విధంగా శ్రీపాదవారు సామెతలు, ఉద్ధరణల తోటి తమ రచనలకు మరింత వన్నెను తీసుకువచ్చారు.

# శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారి భాషా నేపథ్యం - దృక్పథం

- ఆలమూరు మనోజ్ఞ

(6)

శ్రీపాదవారి కథల్లో మాత్రమే దొరికే అరుదైన పద సముదాయం.

1.వరకం - చిక్కు, కఠినంగా పని చేయించుట.

2.ప్రబుద్ధం - ప్రఫుల్లము, వికసించినది.

3.నిసుగు - శిశువు.

4.పరిప్లుతము - తేలియాడుతున్నది, నిండిన.

5.పిహిత - దాచబడినది.

6.అవిరళిత కపోలం - చెక్కిలికి చిక్కిలి ఆన్చి.

7.సాకూతం - అనుకూలం

8.నైశిత్యం - ప్రజ్ఞ

9.రాగగర్భితం - అనురాగ సూచికం.

10.తర్జని - జుట్టున వేలు, చూపుడు వేలు.

11.అసూర్యంపశ్య - ఎండకన్నెరగని,వెలుగుజూడని.

12.ప్రత్యవాయం - పాపము,దురదృష్టం.

13.గోదినీ - నొసలు, అలికము.

14.ధౌర్త్యం - ధూర్తత్వం.

15.అహమిక - అహంకరం.

16.రుష్టుడు - కోపము వచ్చినవాడు.

17.అభిజాత్యం - అభిజాతభావం, ఆత్మగౌరవం

18.నిర్విణ్ణత - నిర్వేదము.

19.రసకందాయపట్టు - రసవత్ ఘట్టము.

20.సర్వాంగీణము - ఎల్ల అవయవములతో గూడినది, వ్యాపించిది.

21.వైరస్యం - వెగటు.

22.కవటాకులు - తమలపాకులు.

23.లాలకీ - పల్లకీ.

24.అకించనుడు - దరిద్రుడు.

25.కవోష్ణం - ఇంచుక వేడి, వేడి గలది.

26.అసివారులు - ఈరువాటు ,విహారము.

27.నిర్హేతుక జాయమానం - అకారణంగా పుట్టేది.

28.సన్నికృష్టం - చేరువలో ఉన్నది.

29.ఉపాంగం - సుతిపోసెడి తిత్తి, మీమాంసాది.

30.ఉలకం - అపాయం,చులకన,లఘువు.

31.బరాతము - లిఖిత పూర్వకమైన ఆజ్ఞ .

32.కొండికవాడు - చిన్నవాడు.

33.దేవిడీమన్నా - ఊరినుంచి బయటకు తరుముట.

34.గుబ్బెతలు - యువతులు.

35.రుంజలు - చర్మ వాద్య విశేషము.

36.కటారీ - కత్తి.

37.అహితులు - శత్రువు.

38.చికిలీ చేసిన - తుడిచి చక్కచేయుట.

39.కొంజా - చూరు.

40.బిటబిటలాడడం - గాభరాపడడం.

41.పైసలా - ముగింపు.

42.నాలుఘ్ఘళ్ళ పొద్దు - తెల్లవారు జాము.

43.దొప్పదోగిపోవడం - నిండిపోవడం.

44.బాతుకలం - పెన్సిల్.

45.కంతాణీ - కలం.

46.దానాదీనా - అలా ఇలా.

47.దిలాసా - నమ్మకం.

48.తస్సా - తీవి,దర్జా.

49.సబ్బంది - సుఖం.

50.సొడ్డు - నింద,ఓడిన వారిని గేలిచేయడం.

51.కాసికలు - చాడీలు.

52.నికషం - రాక్షసుల తల్లి, ఒరగల్లు సాన.

53.యౌగికం - యోగము వలన కలిగినది.

54.సలిపోవడం - వాలిపోవడం.

55.ప్లావితం - తడిసి ముద్దయినది.

56.సమ్యగ్బోధ - మంచి జ్ఞానం.

57.తూష్ణీభావం - నిరసన.

58.సుభోదం - మంచిమాట.

59.అత్మోత్కర్ష - తాను గొప్ప అనే భావం.

60.పుట్టుపేళ్ళు - నామకరణంతో పెట్టిన పేర్లు, చిరపరిచితాలు.

61.అగావయింది - గొడవ అయింది.

62.దోసిలి వొగ్గడం - వినయం చూపడం.

63.సకృతం - అప్పుడప్పుడు.

64.శల్యగతం - అస్థిగతం, వదలనిది.

65.చుక్కలు దుళ్ళాయి - చుక్కలు రాలడం.

66.మప్పితం - మతము, పరిమితము.

67.విహితులు - మిత్రులు.

68.తవ్వాయి - తగువు.

69.అహితులు - శత్రువులు.

(సమాప్తం)